
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 2 సెప్టెంబరు 2025




మత్తడి దూకుతున్న బేతుపల్లి పెద్ద చెరువు


కొణిజర్ల వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న పగిడేరు వరద

దంచికొట్టింది..

- అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- 5.2సెం.మీ సగటు వర్షపాతం నమోదు
- అత్యధికంగా ఖమ్మం రూరల్‌లో 7.4సెం.మీ.
- పొంగిపొర్లిన వాగులు.. నిలిచిన రాకపోకలు
- ఖమ్మం వద్ద పెరుగుతున్న మున్నేరు నీటిమట్టం

ఖమ్మం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లాలో వర్షం దంచికొట్టింది. అర్ధరాత్రి వేళ పడిన కుండపోత వానతో వాగులు, వంకలు, చెరవులు పొంగి ప్రవహించాయి. దీంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోగా వాగుల వెంట లోతట్టు ప్రాంతంలో పత్తి, మొక్కజొన్న, పెసర తదితర పంటలకు నష్టం జరిగింది. ఈనెలలో మళ్లీ భారీవర్షం పడడంతో మళ్లీ వాగులు పొంగడంతో సోమవారం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఖమ్మం వద్ద మున్నేరు కూడా ఉధృతంగా ప్రవహిస్తుంది. జిల్లాలో సోమవారం ఉదయం సగటు వర్షపాతం 5.2 సెం.మీ వర్షపాతం నమోదవగా అత్యధికంగా ఖమ్మంరూరల్‌లో 7.4సెం.మీ., తల్లాడలో 7.4సెం.మీ., వైరాలో 7.3సెం.మీ., కొణిజర్ల 6.9సెం.మీ, రఘునాథపాలెం 6.8సెం.మీ., సింగరేణి6.6సెం.మీ., ఖమ్మం అర్బన్ 6.3సెం.మీ., పెనుబల్లి 6.2సెం.మీ., కామేపల్లి 6.0సెం.మీ., మధిర 5.8సెం.మీ., వేంసూరులో 5.8సెం.మీ., సత్తుపల్లి 5.7సెం.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కూడా 5సెం.మీ.లోపు వర్షం పడింది. జిల్లాలో కురిసిన భారీవర్షంతో ఏర్లు, వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి.

సోమవారం రాత్రి 9గంటలకు ఖమ్మం వద్ద మున్నేరు 14.8అడుగులకు చేరింది. ఇది క్రమంగా పెరుగుతూ వస్తోంది. రఘునాథపాలెం మండలంలోని గరిడేపల్లి వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వీఆర్ బంజర గ్రామానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొణిజర్ల మండలం లాలపురం-తీగలబంజర మధ్య పగిడేరు వాగు ప్రవహించడంతో పల్లిపాడు-ఏన్కూరు మధ్య రాకపోకలు నిలిచిపోగా తల్లాడ మీదుగా వాహనాలను మళ్లించారు. చింతకాని మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. బోనకల్-ఖమ్మంప్రధాన రహదారిపై నేరడ, లచ్చగూడెం, వద్ద వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కామేపల్లి మండలంలో కొత్తలింగాల-జోర్నకల్ రోడ్డు వద్ద బ్రిడ్జిపైనుంచి వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. సత్తుపల్లి మండలంలో తామరచెరువు పొంగి ప్రవహిస్తోంది. కాకర్లపల్లి రోడ్డుపైనా నీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. అయ్యాగారిపేట- కాకర్లపల్లి వద్దపంట పొలాలు నీటమునిగాయి. తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. బేతుపల్లి చెరువకు భారీగా నీరు చేరడంతో 3 అడుగుల ఎత్తున నీరు ప్రవహించింది. పెనుబల్లి మండలంలో తాళ్లపెంట, టేకులపల్లి మధ్య వాగు పొంగడంతో రాకపోకలు నిలిచాయి. ఏన్కూరు మండలంలోని పలుచోట్లభారీ వర్షానికి రహదారులు దిగ్బంధం కాగా పత్తి, మిర్చి పొలాల్లో నీరు ఉధృతంగా ప్రవహించింది. వైరా మండలంలో వాగులు పొంగడంతో రాళ్లవాగు పొంగి రహదారిపై నీరు రావడంతో కొద్దిసేపు రాకపోకలు నిలిచాయి. రహదారులపై నీరు చేరిన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రహదారులు నీటమునిగిన చోట ఎవరిని వెళ్లనీవ్వద్దని ఖమ్మం పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

నెమ్మదిగా తగ్గుతున్న గోదావరి

- గంటకు అర అడుగు తగ్గుదల
- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ


భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

భద్రాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి క్రమేపి తగ్గుతోంది. గత 48 గంటలుగా ఎగువన భారీవర్షాలు లేకపోవడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపి తగ్గుతోంది. అయితే తొలుత నెమ్మదిగా తగ్గుతూ వచ్చినా.. అనంతరం గంటకు అర అడుగు చొప్పున నీటిమట్టం తగ్గుతోందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు 47.7 అడుగులున్న గోదావరి నీటిమట్టం సోమవారం ఉదయం 6 గంటలకు 47.1 అడుగు, 9 గంటలకు 46.7, 12 గంటలకు 46, 3 గంటలకు 44.9, 6 గంటలకు 43.9, 7 గంటలకు 43.1 అడుగుకు తగ్గింది. కాగా 7.37 గంటలకు 42.9 అడుగులకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరికను భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఉపసంహరించారు. ఇక రాత్రి 11గంటలకు 41.70అడుగులకు చేరింది. కాగా గణేష్ నిమజ్జనాల నేపథ్యంలో భక్తులు లోనికి దిగకుండా స్నానఘట్టాల వద్ద బారికేడ్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. పోలీసు పహారా పెంచారు. మంగళవారం నీటిమట్టం మరింత వేగంగా తగ్గే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

2డి ఎకో యంత్రం.. పనిచేయక శాపం..

- జిల్లా ఆస్పత్రిలో మూలనపడిన గుండె పరీక్ష మిషన్
- స్కానింగ్‌లు నిలిచి.. రోగుల అవస్థలు


మూలన పడిన 2డీ ఎకో మిషన్ ఇది

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గుండె పరీక్షల్లో కీలకమైన 2డి ఎకో యంత్రం పనిచేయడం లేదు. ఇది జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చే రోగులకు శాపంగా మారింది. మూడు 2డీ ఎకో ద్వారా స్కానింగ్ తీయడం నిలిపేయడంతో అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రిలో క్యాథ్‌లాబ్ మిషన్‌కు అనుసంధానంగా ఉన్న కార్డియాలజీ విభాగంలో ఉన్న యంత్రం.. గత శుక్రవారం మరమ్మతులకు గురైంది. ఇటీవల అధిక శాతం మంది గుండె సంబంధ సమస్యలతో వస్తుండగా.. వారికి తొలుత ఈసీజీ తీసి.. ఆ తర్వాత అనుమానం ఉంటే 2డి ఎకో తీస్తారు. దీని ద్వారా గుండె కవాటాలు, పనితీరును గుర్తిస్తారు. అంతటి కీలకమైన 2 డిఎకో మిషన్ మరమ్మతులకు గురవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీని విషయమై కార్డియాలజీ విభాగం వైద్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమాచారాన్ని ఇచ్చారు. మరమ్మతుల కోసం హైదరాబాద్ నుంచి నిపుణులు రావాల్సి ఉంటుందని తెలిపారు. అయితే అక్కడి నుంచి నిపుణులు వచ్చి మరమ్మతులు చేపట్టడానికి జాప్యమవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కళ్లెదుటే కన్నీరు!

- వృథాగా పోతున్న పెదవాగు వరద
- సాగుకు నీరు లేక ఆయకట్టు రైతుల ఆవేదన
- మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని రెండు రాష్ట్రాలు

6

పల్లె ఓటర్లు.. 8,02,690

- లెక్కతేల్చిన అధికారులు
- నేడు తుది జాబితా వెల్లడి



ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో పల్లె ఓటర్ల లెక్క తేల్చారు. మంగళవారం తుది జాబితా విడుదల చేయనున్నారు. జిల్లాలో మొత్తంగా 8,02,690 మంది ఓటర్లున్నట్టు లెక్క తేలింది. జిల్లాలో కల్లూరు, ఏదులాపురం మున్సిపాలిటీగా మారడంతో అక్కడి పంచాయతీలు తగ్గాయి. 2025న జనవరిలో ప్రకటించిన కొత్త ఓటర్ల జాబితా ఆధారంగా జాబితాను అధికారులు సిద్ధం చేశారు. జిల్లాలో 571 గ్రామపంచాయతీల్లో 5,214 వార్డులను విభజించారు. ఓటింగ్ ప్రక్రియ కోసం 5,214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో వార్డులు, పంచాయతీల వారీగా తుది జాబితాను మంగళవారం ప్రదర్శనకు పెట్టనున్నారు. గత నెల 28న జాబితా, పోలింగ్ కేంద్రాలపై షెడ్యూల్ విడుదల చేయగా 31 వరకు(క్లెయింలను) అభ్యంతరాలను స్వీకరించారు. మొత్తంగా 1042 క్లెయింలు వచ్చాయి. వీటిని అధికారులు ఆయా మండలాల వారీగా పరిష్కరించి తుది జాబితాను మంగళవారం అన్ని మండల కేంద్రాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించనున్నారు. దీని ద్వారా త్వరలో జరిగే ఎన్నికలను నిర్వహించనున్నారు.

మహిళలే అధికం..

పల్లె ఓటర్లలో మహిళలే అధికంగా ఉన్నారు. పురుషులకంటే 26,180 మంది ఎక్కువగా ఉన్నారు. ఎక్కువ శాతం వార్డుల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. అభ్యర్థుల విజయంలో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. జిల్లాలో మొత్తం 8,02,690 మంది ఓటర్లుండగా వీటిలో మహళలు 4,14,424, పురుషులు 3,88,244 మంది ఉండగా థర్డ్ జెండర్లు 22 మంది ఉన్నారు.

పోలింగ్ స్టేషన్ల ఎంపిక కూడా..

జిల్లాలో కొన్ని పంచాయతీలు తగ్గడంతో పోలింగ్ కేంద్రాలు తగ్గాయి. ప్రస్తుతం 5,214 పోలిం గ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యంతరాల స్వీకరణ కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఒకే ఒక అభ్యంతరాన్ని వ్యక్తం చేయడంతో వాటిని పరిష్కరించారు. కుటుంబసభ్యులు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నట్టు అధికారులు తెలిపారు.

పెరుగుతున్న మున్నేరు..


ఖమ్మంలో మున్నేరు ఉధృతి

ఎగువన కురిసిన భారీ వర్షాలు, వస్తున్న వరదలతో ఖమ్మం వద్ద మున్నేరు ప్రవాహం పెరుగుతోంది. సోమవారం సాయంత్రం 6గంటల సమయానికి 14అడుగుల వద్ద ఉన్న ప్రవాహం రాత్రి 9గంటలకు 14.8అడుగులకు చేరింది. అయితే ఎగువన వరద ఉధృతి నెమ్మదిగా తగ్గుతోందని, దాంతో ఖమ్మం వద్ద మున్నేరు కూడా మంగళవారానికి తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే సోమవారం మున్నేటి వద్ద వినాయక నిమజ్జనాలు జరగ్గా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, కార్పొరేషన్ అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు.

రామాలయ అభివృద్ధికి అంచనాలు సిద్ధం



- రూ.350 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పనులు
- ఇప్పటికే భూ సేకరణ పూర్తి
- దేవాదాయ శాఖకు అప్పగింతే మిగిలింది

6

భారీ వర్షాల నష్టాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలి

వీసీలో కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

కొత్తగూడెంకలెక్టరేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి.. కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం ఆయన హైదరాబా ద్ సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడి యో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో చెరువులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, చెరువుల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలన్నారు. ఇప్పటివరకు విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనుల వివరాలతో కలెక్టర్లు నివేదిక అందజేయాలని ఆదేశించారు. వర్షాలు, వరదల కారణంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందించాలన్నారు. గతేడాది ఏర్పాటు చేసిన ఎస్డీఆర్‌ఎఫ్ వరదల సమయంలో బాగా పని చేసిందని అభినందించారు. వరదల్లో చనిపోయినవారికి,జంతువులకు కూడా పరిహారం ఇవ్వాలని, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై సమగ్రనివేదిక సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని కోరారు. భద్రాద్రి నుంచి కలెక్టర్ జితేష్ తోపాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు బెండాలపాడుకు సీఎం

- వెలువడని పర్యటన షెడ్యూల్
- గ్రామంలో పర్యటించిన కలెక్టర్, ఎస్పీ
- తమకు అధికారిక ఆదేశాలు రాలేదన్న జితేష్
- ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే, నేతలు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చంద్రుగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం చంద్రుగొండ మండలంలోని బెండాలపాడులో పర్యటించనున్నారు. లబ్ధిదారులు గృహప్రవేశం చేయబోయే ఇళ్లు, హెలిప్యాడ్, సభాస్థలాల ఏర్పాట్లను ఓ వైపు అధికారులు, మరోవైపు ప్రజాప్రతినిధులు, నేతలు పర్యవేక్షిస్తున్నారు. అయితే దీనిపై అధికారికంగా షెడ్యూల్ విడుదల కాలేదు. సీఎం రేవంత్ బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో పర్యటించి మధ్యాహ్నానికి బెండాలపాడు చేరుకుంటారని తెలుస్తోంది. ఈ క్రమంలో సీఎం పర్యటనను ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు స్థానిక నాయకులు రెండు రోజుల నుంచి ప్రకటనలు చేస్తున్నారు. కాగా సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజుతో పాటు పలు శాఖల అధికారులు బెండాలపాడు, దామరచర్లలో జరుగుతున్న సభా ఏర్పాట్లును పరిశీలించారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. 3న చంద్రుగొండ మీదుగా ప్రయాణించే వాహనాల దారి మళ్లింపు, ట్రాఫిక్ నిబంధనలను పోలీసు యంత్రాంగం జారీ చేసింది. ఇదిలా ఉండగా ఏర్పాట్లను పర్యేక్షించేందుకు బెండాలపాడు వచ్చిన కలెక్టర్‌ను కొందరు విలేకరులు బుధవారం ముఖ్యమంత్రి పర్యటన ఉందా? అని అడగ్గా.. 'మీరే రాస్తున్నారుగా..' అంటూ అసహనం వ్యక్తం చేసిన ఆయన ఇంతవరకు తమకు అధికారికంగా ఎటువంటి ఆదేశాలు, షెడ్యూల్ అందలేదని, అందిన వెంటనే ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు. అయితే మధ్యాహ్న సమయంలో ఎమ్మెల్యే జారే, మంత్రి పొంగులేటి క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జ్ దయాకర్ రెడి బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల వద్ద, చంద్రుగొండ హెలిప్యాడ్, దామరచర్లలో బహిరంగ సభా స్థలంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు.

ఉత్తర్వులే తరువాయి..

- సాదా బైనామాలకు సిద్ధంగా ఉండాలని అధికారులకు మౌఖిక ఆదేశాలు
- కోర్టు తీర్పుతో తొలగిన అడ్డంకులు



సత్తుపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు తీర్పుతో సాదాబైనామా దరఖాస్తులకు మోక్షం లభించనుంది. సాదా అగ్రిమెంట్లతో భూములు కొనుగోలు చేసిన వారు రెగ్యులర్ చేయించుకునేందుకు ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. వారి నిరీక్షణ కోర్టు తీర్పుతో ఫలించనుంది. 2014కు ముందు సాదా అగ్రిమెంట్లతో కొనుగోలు చేసిన భూములకు సంబంధించి యజమానులకు రెగ్యులర్ చేశారు. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తరువాత కూడా సాదా బైనామా అమలు చేయాలని అప్పటి ప్రభుత్వం భావించినా.. ధరణి చట్టంలో సాదాబైనామా అంశం పొందుపరచకపోవటంతో అమలుకు అడ్డంకిగా మారింది. దీనికి సంబంధించి కొందరు కోర్టును ఆశ్రయించటంతో కోర్టు కూడా అప్పట్లో సాదాబైనామా నిలిపివేసింది. ఈ కేసు నడుస్తుండగానే భూ భారతి చట్టం అమల్లోకి రావటం ఈ చట్టంలో సాదాబైనామాకు వీలు కల్పిస్తూ పొందుపరచటంతో కోర్టు కూడా సాదాబైనామాకు అనుమతిస్తూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో సాదా అగ్రిమెంట్లతో భూములు కొనుగోలు చేసిన వారిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తర్వుల జారీయే తరువాయి అని, ఇప్పటికే అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయని తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో 1.74లక్షల దరఖాస్తులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాదా అగ్రిమెంట్లతో (మిగతా 6వ పేజీలో)

కళ్లెదుటే కన్నీరు!

- వృథాగా పోతున్న పెదవాగు ప్రాజెక్టు వరద నీరు
- సాగుకు నీరు లేక ఆయకట్టు రైతుల ఆవేదన
- మరమ్మతులకు నిధులు విడుదల చేయని రెండు రాష్ట్రాలు
- అంతర్రాష్ట్ర సమస్యగా మారిన పెదవాగు ప్రాజెక్టు
- తాత్కాలిక రింగ్‌బండ్‌పై ఆశలు అంతంతే..


వృథాగా పోతున్న పెదవాగు ప్రాజెక్టు వరద నీరు


పంటలు వేయని భూములు ఇలా..

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 16వేల ఆయకట్టు కలిగిన పెదవాగు మధ్యతరహా జలాశయం అది. 1980 లో అప్పటి పాలకులు మూడు మండలాల్లో వేలాది మంది రైతుల శ్రేయస్సే ధ్యేయంగా అశ్వారావుపేట మండలంలోని గుమ్మడివల్లి వద్ద ప్రాజెక్టును నిర్మించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు ప్రాజెక్టుపై కొంతవరకు దృష్టి సారించినా.. రాష్ట్ర విభజన అనంతరం పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఆయకట్టు ఎక్కువ భాగం ఆంధ్రాలో.. ప్రాజెక్టు అంతా తెలంగాణాలో ఉండడంతో పాలకులు ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేశారు. పేరుకే మధ్యతరహా జలాశయం అయినా.. ఏనాడు ఒకస్థాయిలో ఉండే చెరువు మరమ్మతులకు ఇచ్చే నిధులను కూడా ఇవ్వని పరిస్థితి. తద్వారా ఆయకట్టు రైతులకు అవస్థలు ఆనాటి నుంచి వెంటాడుతూనే ఉన్నాయి. ఇంత దుర్భర స్థితిలో ఉన్న పెదవాగు ప్రాజెక్టు గతేడాది జూలై 18వ తేదీన వచ్చిన వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. ఆనాడు పెదవాగు ప్రాజెక్టుకు భారీ గండి పడడం రాష్ట్రంలో సంచలనంగా మారింది. ఆ తర్వాత అయినా ప్రాజెక్టుపై పాలకులు దృష్టిపెడతారోమోనని ఆయకట్టు రైతులు ఎదురు చూసినా.. పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ నేపథ్యంలో అంతర్రాష్ట్ర సమస్యగా మారిన పెదవాగు ప్రాజెక్టు దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

● వరద వస్తుంది.. వృథాగా పోతుంది

సుమారు 1100 ఎకరాల విస్తీర్ణంలో 0.6 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో 19.3 అడుగుల ఎత్తులో నీరు ఉండేలా పెదవాగు ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది రైతులు సాగునీటిని పొంది వివిధ రకాల పంటలు పండించుకునే వారు. ఇటువంటి పరిస్థితుల్లో గతేడాది వచ్చిన అకాల వరదలతో ప్రాజెక్టు గేట్లు లేవకపోవడంతో.. ప్రాజెక్టుకు గేట్ల పక్కనే భారీ గండి పడింది. దాదాపు 150 మీటర్ల మేర ఎవరూ ఊహించని రీతిలో గండి పడింది. అనంతరం మూడు గేట్లను అతి కష్టమ్మీద లేపారు. అప్పుడు లేసిన గేట్లు నేటికీ అలాగే ఉన్నాయి. దీంతో ఎప్పుడూ వరద వచ్చినా వృథాగా గోదావరిలో కలవడం తప్పా.. ప్రాజెక్టులో నీరు నిల్వ ఉండటం లేదు. కళ్లెదుటే నీరంతా వృథాగా పోతుంటే గుండెలు పగిలేలా రోదించడం తప్పా.. అన్నదాతలు ఏమి చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు.

● వరదొస్తే రింగ్‌బండ్‌కు ప్రమాదమే..

ప్రాజెక్టు తెగిన సమయంలో పెదవాగును సందర్శించిన రాష్ట్రమంత్రులు, అధికారులు ఆయకట్టు రైతులకు కొంతమేర అయినా సాగు నీరందించాలంటూ రింగ్‌బండ్‌ను నిర్మించారు. రూ.3.5కోట్ల వ్యయంతో తాత్కాలికంగా రింగ్‌బండ్‌ను నిర్మించారు. హడావుడిగా రైతుల ప్రయోజనమే ధ్యేయమంటూ నిధులను ప్రాజెక్టులో పోశారు. ఎలాంటి కాంక్రీట్ వర్క్ లేకుండా కేవలం మట్టితోనే రింగ్‌బండ్‌ను నిర్మించారు. అయితే ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఒక్కోసారి భారీగానే వరద నీరు వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో రింగ్‌బండ్ ఉపయోగం ఎలా ఉన్నా.. ప్రమాదం మాత్రం పొంచి ఉందని ఆయకట్టు రైతులు అభిప్రాయపడుతున్నారు.

● రైతుల గోస తీరేదెన్నడో..!?

ఓవైపు ప్రాజెక్టులో నీరంతా వృథాగా పోతుండడం.. ఆయకట్టులో పంటలు వేయని బీడు భూములుగా మారడంతో అన్నదాతల ఆవేదన వర్ణణాతీతం. ప్రాజెక్టు దుస్థితిపై రైతులు కలవని ప్రజాప్రతినిధి గానీ, అధికారి గానీ లేరు. ఎందరిని కలిసినా ఏమున్నది గోస తప్పా.. అనే మాదిరిగా రైతుల పరిస్థితి మారింది. కొద్దిరోజుల క్రితం మాజీ మంత్రి జలగం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయకట్టు రైతులు జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌ను కూడా మరోసారి కలిసి తమ సమస్యలను వివరించి పరిష్కరించాలని వేడుకున్నారు.

నిధులు విడుదల ఎక్కడ ?

రాష్ట్రాల విభజన అనంతరం ప్రాజెక్టును గాలికొదిలేసిన పాలకులు ప్రాజెక్టుకు గండిపడిన తర్వాత అయినా పట్టించుకుంటారా అదీ లేకుండా పోయింది. ప్రాజెక్టు దుస్థితిని స్వయంగా పరిశీలించిన రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు సంయుక్తంగా మరమ్మతులు చేపట్టాలని భావించి.. రాష్ట్రస్థాయి అధికారులు సమావేశాలు నిర్వహించారు. దాదాపు 19.20కోట్ల వ్యయంతో పూర్తిస్థాయి మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర వాటా 15శాతం కాగా, మిగిలింది ఆయకట్టు అధికంగా కలిగిన ఆంధ్రా రాష్ట్రం వాటా 85శాతం నిధులు మంజూరు చేయాలి. అయితే ఆంధ్రా నిధులు మంజూరు చేయకపోవడంతో తెలంగాణ కూడా నిధులను విడుదల చేయడం లేదు. ఉన్న ఆయకట్టులో అధికంగా పోలవరం ప్రాజెక్టులో పోతుండడంతో నిధులను విడుదల చేయడం లేదనే అభిప్రాయం రైతుల నుంచి వినిపిస్తోంది. అటు ఆంధ్రా, ఇటు తెలంగాణ పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు భవిష్యత్ అంతా అంధకారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ప్రాజెక్టుకు తక్షణ మరమ్మతులు చేయాలి

పుట్టా సత్యం (ఆయకట్టు రైతు, గుమ్మడివల్లి)



ప్రాజెక్టుకు గండి పడటం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రాజెక్టుకు గండి పడినప్పుడు వెంటనే మరమ్మతులు చేయాలి కానీ అధికారుల నిర్లక్ష్యంతో జరిగిన ఈ ఘటనకు నేడు రైతులు బలయ్యారు. ఇప్పటికైనా రెండు రాష్ట్రాలు తక్షణమే నిధులను మంజూరు చేస్తే వేలాది మంది రైతులకు సాగు నీరందుతుంది. తద్వారా పంటలు పండుతాయి. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను వేడుకుంటున్నాం.

పామాయిల్ గెలల టన్ను ధర రూ.19,107

గత నెల కంటే టన్నుకి రూ.1055 పెరుగుదల

అశ్వారావుపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆగస్టు నెలకు సంబంధించి పామాయిల్ గెలల ధరను ఆయిల్‌ఫెడ్ కార్యాలయం సోమవారం ప్రకటించింది. ఆగస్టు నెలకు సంబంధించి టన్ను రూ.19,017లుగా ధర నిర్ణయించినట్టు ప్రకటించారు. ఈ ధర జూలై నెలలలో చెల్లించిన ధర కంటే టన్నుకి రూ.1055లు అదనంగా పెరిగినట్టు ప్రకటించారు. వివరాలిలా ఉన్నాయి. జూలై నెలలో పామాయిల్ గెలల ధర టన్ను 18,052లుగా ప్రకటించడంతో రైతుల్లో కొంత మేర నిరాశవ్యక్తం అయ్యింది. ఆ తర్వాత ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్లో గానీ, ఎఫ్ఎఫ్‌బీ సవరణల వల్లో గానీ గత ఆగస్టు నెలలో టన్ను ఒక్కంటికి రూ.1055లు పెరిగి టన్ను ధర రూ.19,017కి పెరిగింది. ఒక్క నెలలో టన్నుకి రూ.1055లు పెరగడం పట్ల రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం పామాయిల్‌కి సీజన్‌గా చెప్పుకుంటారు. ఈ సమయంలో ఏడాది మొత్తంలో తక్కువ ధర పలుకుతూ వస్తుంది. దీంతో రైతులు ఆది నుంచి అన్‌సీజన్‌లో చెల్లించిన ధరను సీజన్‌లో చెల్లించడం లేదని, దీని వల్ల రైతులకు మూడొంతుల పంట తక్కువ ధరలోనే అమ్ముకోవాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు. తాజాగా పామాయిల్‌కు సీజన్‌గా చెప్పుకునే ఆగస్టు నెలలో ధర పెరగడం శుభసూచికమని రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజులలో పామాయిల్ ధర మరింత పెరుగుతుందనే ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ (ఐడీఓసీ) ఎదుట పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఆందోళనలో జిల్లా వ్యాప్తంగా గెజిటెడ్, నాన్-గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రభుత్వం తమ హామీలను అమలు చేయకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తారని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ ఆందోళనలో టీజీవో సెక్రటరీ మోదుగు వేలాద్రి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరు సునీల్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం నాయకుడు మల్లెల రవీంద్ర ప్రసాద్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రంజాన్, తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కళ్యాణం కృష్ణయ్య, కార్యదర్శి సుబ్బయ్య ఫణి రాజ్,.స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పరిశ పుల్లయ్య రవికుమార్, ఆల్ పెన్షనర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు, కార్యదర్శి బి. గోపీచంద్, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శులు జెడ్ ఎస్ జైపాల్, గంగవరపు బాలకృష్ణ, హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి.విజయ్ కుమార్, శేషు ప్రసాద్, సూరంపల్లి రాంబాబు, శ్రీనివాసరావు, మధు, ఎం రాజేష్, చంద్రకంటి శశిధర్, టీఎన్జీవో మాజీ అధ్యక్షులు పొట్ట పెంజర రామయ్య పాల్గొన్నారు.

ఊరు మారిన ఓటరు

● మరో గ్రామానికి ఓటు మారిందని తహసీల్దార్‌కు బాధితుడి మొర

కల్లూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామ స్థాయిలో అధికారులు సిద్ధం చేసిన చేసిన ఓటరు జాబితాలో తన పేరు లేదని.. మరో గ్రామంలోని జాబితాలో ఓటు మారడంతో బాధిత ఓటరు లబోదిబోమంటున్నాడు. ఇలా తన పేరున గల ఓటు స్వగ్రామంలోని చెన్నూరు పంచాయతీ పరిధిలోని రావికంపాడు గ్రామానికి చెందిన గంద్ర రాము ఇంటి నెంబరు 7-3 ప్రకారం గతంలో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే తన పేరు గ్రామ ఓటరు జాబితాలో ఉండాల్సి ఉండగా.. ఇక్కడ జాబితాలో లేదని తెలుసుకున్న బాధిత ఓటరు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అధికారులను కలిసి గోడు వెల్లబోసుకున్నాడు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తన ఓటు హక్కును వినియోగించుకోవాలని సంబర పడుతున్న ఓటరుకు ఇలా భంగపాటు కావడంతో అతను తీవ్ర నిరాశ చెందాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని రాము కోరాడు.

ఇల్లెందు బీఆర్ఎస్‌లో సిగపట్లు

● రెండు వర్గాలుగా చీలిన పార్టీ నేతలు

ఇల్లెందు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయి చెట్టుకొకరు.. పుట్టకొకరుగా మారిన ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్‌లో నాయకుల కుమ్ములాటలతో సిగపట్లు తారాస్థాయికి చేరాయి. మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ గత కొద్దిరోజులుగా కార్యకలాపాలు సాగిస్తున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భద్రాద్రి జిల్లా పర్యటన కార్యక్రమాలను విజయవంతం చేయాలంటూ టేకులపల్లిలో నిర్వహించిన సమావేశంలోనూ ఇల్లెందు పట్టణానికి చెందిన కార్యకర్తలు పరస్పరం వాగ్వాదానికి దిగడం గమనార్హం. కాగా తమ పార్టీ నాయకులకు శాసనసభలో కాళేశ్వరం నివేదికపై మాట్లాడే అవకాశం ప్రభుత్వం కల్పించలేదంటూ సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. దీంతో ఇల్లెందులో బీఆర్ఎస్ నాయకులు రెండు వర్గాలుగా చీలి ఆందోళనలు నిర్వహించారు. ఇరువర్గాలు వేర్వేరుగా తెలంగాణ తల్లి విగ్రహం వద్ద, అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేశారు. ఈ ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా నాయకుడు దిండిగాల రాజేందర్ వేర్వేరుగా వర్గాలుగా చీలి ధర్నాలు జరపడంతో.. ఇప్పటివరకు అంతర్గత కుమ్ములాటలతో సాగుతున్న బీఆఆర్ఎస్ కుమ్ములాటలు వీధికెక్కినట్లైంది. టేకులపల్లిలో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే భర్త ఏకంగా ఒక కార్యకర్తనే బెదిరింపులకు గురి చేయడం తో పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొనగా.. తాజాగా బీఆర్ఎస్ నిరసనల్లోనూ నేతలు రెండు వర్గాలుగా చీలడం పట్ల పార్టీ శ్రేణులు నివ్వెరపోతున్నాయి.


మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఆధ్వర్యంలో ధర్నా

ఉత్తర్వులే తరువాయి..

(5వ పేజీ తరువాయి)

భూములు కొనుగోలు చేసిన వారు సాదాబైనామా కోసం 1.74లక్షల మంది దరఖాస్తు చేశారు. వీరంతా 2020కి ముందు దరఖాస్తు చేసిన వారే. వీటితో పాటు ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన భూ భారతి సదస్సుల్లో కూడా పలువురు రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 2020కి ముందు దరఖాస్తు చేసిన వారితో పాటు కొత్త వారు కూడా ఉన్నారు. వారు కూడా సాదాబైనామా వర్తింపజేయాలని కోరుతున్నారు.

ఉత్తర్వులు రాగానే దరఖాస్తుల పరిశీలన

కోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా ప్రభుత్వం కూడా మార్గదర్శకాలతో ఉత్వర్వులు జారీ చేయనుంది. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే సాదాబైనామా ప్రక్రియను అధికారులు ప్రారంభించేందుకు సన్నద్ధమవుతున్నారు. కోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన వెంటనే సాదాబైనామా దరఖాస్తులకు సంబంధించి పరిశీలన ప్రారంభించాలని ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. గతంలో 2014 కంటే ముందు సాదా అగ్రిమెంట్లతో భూములు కొనుగోలు చేసిన వారికే సాదాబైనామా చేయాలని నిబంధనలున్నాయి. ఒక్కో వ్యక్తి మెరక అయిదెకరాలు, తరి రెండున్నర ఎకరాల భూమి వరకూ సాదాబైనామా చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల మధ్య 2014కు పూర్వం, గిరిజనేతరుల మధ్య 1970కు పూర్వం ఉన్న అగ్రిమెంట్లను పరిగణలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏరకమైన మార్గదర్శకాలు విడుదల చేస్తుందనేది అధికారులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాలను బట్టి సాదాబైనామా ప్రక్రియ ముందుకు సాగుతుంది. ఆర్వోఎఫ్ఆర్, అస్సైన్‌మెంట్, ఇతర నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సాదాబైనామా క్రమబద్ధీకరణ వర్తించే అవకాశం లేదు. 2020 తరువాత సాదాబైనామా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని పలువురు ఎదురు చూస్తున్నారు. సాదాబైనామా ప్రక్రియలో భాగంగా ప్రభుత్వ నిర్ణయం మేరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

సింగరేణి సీఎండీని కలిసిన ఈఅండ్‌ఎం డైరెక్టర్

రుద్రంపూర్, (సింగరేణి) సెప్టెంబర్ (ఆంధ్రజ్యోతి) : సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను ఈఅండ్‌ఎం నూతన డైరెక్టర్‌గా ఎన్నికైన మోకాళ్ల తిరుమతరావు సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదనలను ఈఅండ్‌ఎం విభాగం కీలకమైందని చైర్మన్ అన్నారు. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. ప్రధానంగా సోలార్, థర్మల్ విద్యుత్‌రంగంలో సింగరేణి విస్తరించి ఉందని తెలిపారు. సింగరేణి సంస్థలో వివిధ హోదాల్లో పనిచేసిన తిరుమలరావు డైరెక్టర్‌గా ఎన్నిక కావడం పట్ల అభినందనలు తెలిపారు. సింగరేణి చరిత్రలో తొలి ఆదివాసీ అధికారి డైరెక్టర్ స్థాయికి ఎదగడం హర్షణీయమన్నారు.

యూరియా పంపిణీలో గందరగోళం


జూలూరుపాడులోని సొసైటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


యూరియా కోసం న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కొమరారం గ్రామంలో రాస్తారోకో చేస్తున్న రైతులు

జూలూరుపాడు సొసైటీ వద్ద అన్నదాతల పడిగాపులు
పంపిణీలో జాప్యంతో అరకొరగా ఇవ్వడంపై రైతుల ఆగ్రహం
ఇల్లెందులో రోడ్డెక్కిన రైతులు.. మద్దతు పలికిన ఎన్డీ నాయకులు

జూలూరుపాడు / ఇల్లెందు రూరల్ / లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులకు అవస్థలు తప్పడం లేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులోని సొసైటీ కార్యాలయం వద్ద సోమవారం ఉదయమే వివిధ గ్రామాలకు చెందిన రైతులు భారీ సంఖ్యలో బారులు తీరారు. రెండు రోజులుగా కార్యాలయంలో యూరియా లేకపోవడంతో సిబ్బంది రైతులకు పంపిణీ చేయలేదు. యూరియా వచ్చిందని తెలుసుకుని పొందేందుకు బారులు తీరారు. దీంతో పంపిణీలో గందరగోళం నెలకొంది. యూరియాను పొందేందుకు అధిక సంఖ్యలో రైతులు రావడంతో తోపులాట జరిగింది. కార్యాలయంలో 10టన్నులు(225కట్టలు) మాత్రమే ఉండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత నెల 19వ తేదీనే యూరియా కోసం రైతులు పత్రాలను కార్యాలయ సిబ్బందికి ఇచ్చివెళ్లారు. కాగా సిబ్బంది రెండు మూడు రోజుల క్రితం పత్రాలు ఇచ్చిన రైతులకు యూరియాను ఇస్తుండడంతో రైతులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పత్రాలను ముందు సమర్పించినప్పటికీ.. వెనక వచ్చిన వారికి ఎలా యూరియాను ఇస్తున్నారని సిబ్బందిని నిలదీశారు. ఒక్కొక్క రైతుకి 2 యూరియా కట్టలను మాత్రమే ఇచ్చారు. 120 మంది రైతులకు మాత్రమే యూరియాను అందించి స్టాక్ అయిపోయిందని సొసైటీ సిబ్బంది చెప్పడంతో.. మిగిలిన రైతులు వెనుదిరిగి వెళ్లిపోయారు. యూరియా తగినంత అందడం లేదని రైతులు వాపోయారు. పంపిణీ చేయటంలో సిబ్బంది జాప్యం చేస్తున్నారని రైతులు ఆరోపించారు. సీఈవో రమణారెడ్డి మాట్లాడుతూ.. 10టన్నుల రావటంతో 120 మంది రైతులకు వాటిని పంపిణీ చేశామని, ఇంకా 150మంది రైతులు పత్రాలు తమకు సమర్పించారని వారికి స్టాక్ వచ్చిన తర్వాత పంపిణీ చేస్తామని తెలిపారు.

ఇల్లెందు-గుండాల రహదారిపై రాస్తారోకో

రైతులకు సరిపడా యూరియా అందజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇల్లెందు మండలం కొమరారం గ్రామంలోని ఇల్లెందు-గుండాల ప్రధాన రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. వారికి న్యూడెమోక్రసీ నాయకులు మద్దతుగా నిలిచారు. రెండు రోజులుగా యూరియా కోసం పీఏసీఎస్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న యూరియా అందించకపోవడంతో రైతులు ఆగ్రహించి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు, రైతులకు యూరియా అందించడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. యూరియా కోసం రైతులు ఇంత ఇబ్బందులు పెట్టడం సరికాదని, దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఇబ్బందులు గురిచేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రైతులు గుణపాఠం చెప్పే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. నాయకులు యదలపల్లి సత్యం, మోకాళ్ల కృష్ణ, పోడుగు నర్సింహరావు, మాలు, జోగ కృష్ణ, వాంకుడోత్ మోతిలాల్, మాజీ సర్పంచ్‌లు సంతు, శ్రీను, సూర్నపాక నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లిలో..

యూరియా కొరతతో మండల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీరోజు వ్యవసాయ మార్కెట్‌యార్డులో పడిగాపులు కాస్తున్నారు. సోమవారం యూరియా లోడ్ లారీ వస్తుందని సంబంధిత అధికారులు సమాచారం ఇవ్వడంతో.. చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం మండలాలకు చెందిన రైతులు భారీ వర్షంలోనే ఉదయం 6గంటల నుంచి ఎదురుచూపులు చూశారు. అయినా యూరియా రాకపోవడంతో రైతులు ఆందోళన చేశారు.


జూలూరుపాడులోని పాఠశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

జూలూరుపాడులో విద్యార్థుల ఆందోళన

సిబ్బంది మెనూ పాటించడం లేదని ఆరోపణ

జూలూరుపాడు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించడం లేదని, భోజనం సరిగా వండడం లేదని, నాసిరకం భోజనంతో ఇబ్బందులు పడుతున్నామని జూలూరుపాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం రహదారిపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రభుత్వం అమలుచేసిన మెనూ సిబ్బంది అమలు చేయడం లేదన్నారు. కోడిగుడ్లు కూడా ఇవ్వడం లేదని, ప్రతీరోజు పప్పు కూర మాత్రమే పెడుతున్నారన్నారు. పురుగుల అన్నం పెట్టడంతో తాము అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య వచ్చి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని విద్యార్థులకు హామీ ఇవ్వడంతో.. వారు ఎట్టకేలకు శాంతించారు.

కాళేశ్వరం ప్రాజెక్టును అభాసుపాలు చేస్తున్నారు

బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరులో శ్రేణుల నిరసన

మణుగూరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగు నీరిందించే సామర్థ్యం గల కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు.. వేస్తున్న కమిషన్లను తెలంగాణ ప్రజలు, రైతులు తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారని బీఆర్ఎస్ భద్రాద్రికొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని, ఉద్యమనేత కేసీఆర్‌ను అభాసుపాలు చేసే విధంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. ఘోష్ కమిషన్‌కు నిరసనగా సోమవారం భద్రాద్రి జిల్లా మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సాగు నీరు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న నేపథ్యంలో తెలంగాణ ఉద్యమ కారుడు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రైతుల కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారన్నారు. కోటి ఎకరాల భూమిని సాగు భూమిగా మార్చే సామర్థ్యం గల ఈ ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగగా.. దాన్ని నాటి సీఎం కేసీఆర్ కట్టినట్టుగా చిత్రీకరిస్తూ అభాసుపాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కుంగిన పిల్లర్లుకు మరమ్మతులు చేయించి ప్రజల శ్రేయస్సు కోరే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా రాద్ధాంతం చేయడమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దొంగ నాటకాలు బయట పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

భద్రాద్రి రామాలయ అభివృద్ధికి అంచనాలు సిద్ధం

- రూ.350 కోట్లతో చేపట్టనున్న పనులు
- ఇప్పటికే భూ సేకరణ పనులు పూర్తి
- దేవాదాయ శాఖకు అప్పగింతే మిగిలింది

భద్రాచలం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రామ భక్తుల చిరకాల స్వప్నమైన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో వేగం పెరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎ.రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం భద్రాచలం వచ్చిన తరుణంలో రామాలయ అభివృద్ధిని చేపడతామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో దేవాదాయ శాఖ అధికారులు, ఆర్కిటెక్ట్, స్థపతి పరిశీలన అనంతరం రామాలయ అభివృద్ధి పనులకు సంబంధించి మాస్టర్ ప్లాన్ నమూనా సిద్ధం చేశారు. ఇదే సమయంలో భూసేకరణకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయగా.. అనంతరం నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపు కోసం రూ.34 కోట్ల నిధులను విడుదల చేసింది. ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియ పూర్తి కాగా రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది దేవస్థానాలకు రూ.2,200 కోట్ల అంచనాలతో అభివృద్ధి పనులు, భక్తుల సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి రూ.350 కోట్లతో అభివృద్ధి చేయనుండగా మూడు విడతల్లో ఇందుకు సంబంధించిన నిధులు విడుదల కానున్నట్టు తెలుస్తోంది.

ఇప్పటికే భూ సేకరణ పనులు పూర్తి

రామాలయ పరిసరాల్లో అవసరమైన మేరకు స్థల సేకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ క్రమంలో దక్షిణం వైపు ఉన్న 46 ఇళ్లను తొలగించి ఇందుకు గాను సంబంధిత నిర్వాసితులకు రూ.34 కోట్ల పరిహారాన్ని చెల్లించారు. అనంతరం ఆ ఇళ్లను తొలగించగా.. సుమారు ఒక ఎకరం భూ సేకరణ పనులు ఇప్పటికే పూర్తయినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. వచ్చే వారంలో సేకరించిన భూమిని దేవాదాయ శాఖకు అప్పగించనున్నట్టు రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

భక్తులు మెచ్చే రీతిలో...

భద్రాద్రి రామాలయ అభివృద్ధి భక్తులు మెచ్చే రీతిలో ఉంటుందని దేవాదాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. చారిత్రకపరమైనటువంటి నిర్మాణాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఎంత వరకు అవసరమో అంత మేరకు మాత్రమే నిర్మాణాలనుతొలగించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు ఇటీవల భద్రాచలంలోని చిత్రకూట మండపంలో జరిగిన మాస్టర్‌ప్లాన్ ప్రాథమిక నమూనా సమర్పణ సమయంలో వెల్లడించారు. భద్రాద్రి దేవస్థానం వైదిక వర్గాలు సూచనల మేరకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ద్వారా ప్రభుత్వానికి పంపనున్నారు.

నాడు ఆర్డీవోగా... నేడు దేవస్థానం ఈవోగా..

భద్రాద్రి రామాలయ అభివృద్ధికి దక్షిణం వైపు భూ సేకరణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిన సమయంలో నాడు భద్రాచలం రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు నిర్వహించిన కె.దామోదర్‌రావు నేడు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానానికి ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తుండటం విశేషం. ఆయన హయాంలో భూ సేకరణ చేపట్టగా.. నేడు రామాలయ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్న క్రమంలో ఈవోగా పర్యవేక్షణ చేపట్టనున్నారు.

హరీశ్‌రావు, సంతోష్‌రావు

అవినీతి అనకొండలు

(మొదటిపేజీ తరువాయి)



మీడియా మిత్రులతో రకరకాలుగా చెప్పించారు. సోషల్ మీడియా ద్వారా ఇప్పటివరకు నాపై జరిగిన పర్సనల్ ఎటాక్‌ను ఓర్చుకుంటూ వచ్చాను. ఇంతవరకు పేరు పెట్టి చెప్పలేదు. ఇప్పుడు మొదటిసారి చెబుతున్నా. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ చేస్తామంటుంటే.. ఒక బిడ్డగా కడుపు రగిలిపోతోంది. అందుకే చెబుతున్నా" అని అన్నారు.

ఇంకా వాళ్లనే మోస్తారా?

"హరీశ్‌రావు, సంతోష్.. కేసీఆర్ పక్కన ఉండి, ఆయన పేరు చెప్పుకొని అనేక విధాలుగా లబ్ధి పొందారని కవిత తెలిపారు. వారి చర్యల వల్లే కేసీఆర్ పేరు బద్నామ్ అయ్యే పరిస్థితి వచ్చింది. అయినా వాళ్లనే మోస్తామని, వాళ్లనే మళ్లీ ముందుకు తీసుకెళ్తామని అనుకుంటే.. పార్టీ ఎలా ముందుకుపోతుందని ప్రశ్నించారు. "ఒక బిడ్డగా నేను బాధపడుతున్నా. ఐదేళ్లు ఇరిగేషన్ మంత్రిగా చేసిన హరీశ్‌రావుకు ఇందులో మేజర్ పాత్ర లేదా? మా నాన్న పరిస్థితి నేను దగ్గరుండి చూశాను. నా పెళ్లికి డబ్బుల కోసం ఆయన ఎంత ఇబ్బంది పడ్డారో నాకు తెలుసు. రాజకీయాల్లో 40, 50 ఏళ్లు ఉన్నా.. కేసీఆర్ ఆస్తులు సంపాదించుకోలేదు. నాకు తెలిసి ఆయనకు డబ్బుపై ఎన్నడూ ఆశలేదు. అలాంటి వ్యక్తిపై సీబీఐ విచారణ చేస్తామని, కేసులు వేస్తామని అంటే.. ఇందుకు ఎవరు కారణం? ఈ వయసులో ఆయనపై సీబీఐ కేసులేంటి? ఏం ఖర్మ? ఇలాంటి వాళ్లను ఎందుకు భరించాలి? ఎందుకు ప్రొటెక్ట్ చేయాలి? బీఆర్ఎస్ తమ్ముళ్లకు నాపై కోపం రావచ్చు. వాస్తవాలు చేదుగా ఉన్నా.. మందులాగా అప్పుడప్పుడు మాట్లాడితేనే ఆరోగ్యంగా ఉంటుంది" అని కవిత వ్యాఖ్యానించారు.

హరీశ్, సంతోష్ వెనక రేవంత్‌రెడ్డి..

కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని ప్రభుత్వమని కవిత మండిపడ్డారు. ఏసీబీ మగ్గురు కాళేశ్వరం ఇంజనీర్లను పట్టుకుంటే, ఒక్కో ఇంజనీరు దగ్గర వందల కోట్ల ఆస్తులు బహిర్గతమైతే.. విచారణ చేసే దమ్ము ప్రభుత్వానికి లేకుండాపోయిందని ధ్వజమెత్తారు. వారి వెనకాల ఎవరున్నారని ప్రశ్నించారు. "హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనక రేవంత్‌రెడ్డి ఉండి కాపాడుతున్నారు. బాణం గురి ఎంతసేపూ కేసీఆర్‌పైనే ఉంది. అందుకే అన్ని విషయాల్లో వాళ్లను ఏమీ అనరు. వాళ్ల గురించి మాట్లాడరు. ఈ అవినీతి అనకొండలతో రేవంత్‌కు ఉన్న రహస్య ఒప్పందం బహిర్గతం కావాలి. పీసీ ఘోష్ కమిషన్ నివేదికలో ఏముందో చెప్పకుండానే టక్కున సీబీఐకి ఇస్తామనడం ముందస్తు కుట్ర. కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వారి లక్ష్యం. మీరు బట్టకాల్చి మీదవేసినట్లు ఆరోపణలు చేయడం కాదు. నేను డిమాండ్ చేస్తున్నా.. పేర్లు కూడా చెప్పాను. దమ్ము ధైర్యం ఉంటే వారిపై విచారణ చేయించాలి. వాస్తవాలు బయటపెట్టి వారితో అండర్‌స్టాండింగ్ లేదని నిరూపించుకోవాలి" అని కవిత సవాల్ చేశారు.

ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు..!

తాను తన తండ్రికి రాసిన లేఖను లీక్ చేసిన సందర్భంలో అసలు విషయాలు బహిర్గతం చేసినందుకు 90 రోజులుగా తనను దుష్ప్రచారాలతో వేధిస్తున్నారని కవిత తెలిపారు. ఇప్పుడు కాళేశ్వరం విషయంలో వాస్తవాలు మాట్లాడినందుకూ వాళ్ల సోషల్ మీడియా బ్యాచ్‌లు రేపటి నుంచి అడ్డగోలు విమర్శలు చేస్తాయన్నారు. "నన్ను బీజేపీ ఆపరేట్ చేస్తుందంటారు. కాంగ్రెస్ ఆపరేట్ చేస్తుందంటారు. ఒకరు రేవంత్‌రెడ్డి చెబితే మాట్లాడుతుందని, మరొకరు బండి సంజయ్ చెబితే మాట్లాడుతుందంటూ దుష్ప్రచారం చేస్తారు. ఖబడ్దార్ బిడ్డా.. నేను ఎవరో చెబితే ఆడే తోలుబొమ్మను కాదు. నాది కేసీఆర్ రక్తం.. తెలంగాణ బ్లడ్. వ్యక్తిగతంగా నేను అనుకున్న విషయాన్ని చెబుతున్నా. దానికి రాజకీయంగా ఇబ్బంది అయినా, నష్టమయినా, కష్టమయినా.. నేనే భరిస్తా" కవిత స్పష్టం చేశారు.

ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది?

దేశంలో ఎక్కడికి వెళ్లినా.. కేసీఆర్ మహానాయకుడు అంటారని కవిత తెలిపారు. ఇప్పుడు సీబీఐ విచారణ జరిపితే.. ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. "మా నాన్న పరువు పోతే నాకు బాధ. మీకా? వాళ్లకు పైసలు కావాలె. పేరుతో ఏం పని? ఇంక కూడా ఇటువంటి విషయాలు అర్థం చేసుకోకుండా, ఇలాంటి వ్యక్తులను దూరం పెట్టకుంటే.. ఇలాంటి పార్టీ ఉంటే ఏంది? పోతే ఏంది? బీఆర్ఎస్ నాయకులు నన్ను తిట్టుకున్నా సరే. స్థానిక ఎన్నికల్లో నష్టం జరుగుతదని అనుకున్నా సరే. మా నాన్నమీద సీబీఐ విచారణ పడ్డాక ఏముంది? ఎలక్షన్‌లో ఒకరు గెలుస్తరు, ఒకరు ఓడిపోతరు. అసలు పార్టీ ఓడిపోయే పరిస్థితి ఎందుకు వచ్చింది? ఇటువంటి దుర్మార్గుల వల్ల కాదా? ఈ అంటే.. మా దగ్గర పైసలున్నయని, టీవీలున్నయని, సోషల్ మీడియాలున్నయని ఎటు పడితే అటు మాట్లాడతామంటే తోలు తీస్తం. గీత గీసుకుంటం బిడ్డా. మీరు ఒక కామెంట్ పెడితే.. మేం పది పెడతాం. ఇంతకాలం చూస్తూ ఊరుకున్నా. పెద్ద సారు దగ్గరికి వచ్చాక ఇక కాంప్రమైజ్ అయ్యేది లేదు. నిజంగానే ఆయన అవినీతికి పాల్పడితే వేరుమాట. కేసీఆర్‌కు ఎప్పుడూ తెలంగాణ ధ్యాసే.. అదే పిచ్చి. అలాంటి వ్యక్తిపై ఏది పడితే అది మాట్లాడితే.. రియాక్ట్ కాకపోవడం చాలా దారుణం. సీబీఐ విచారణ చేస్తున్నామని రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటిస్తే.. తెలంగాణ బంద్‌కు పిలుపు ఇవ్వొద్దా? తెలంగాణ భగ్గుమనొద్దా? దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. ఏదేమైనా సీబీఐ విచారణ చేసినా.. కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారు" కవిత పేర్కొన్నారు.

మూడు పిల్లర్లు కుంగిపోతే రెండున్నరేళ్లుగా లొల్లి!

కేసీఆర్ తరతరాలకు తరగని ఆస్తిలా కట్టిన కాళేశ్వరాన్ని బద్నామ్ చేస్తున్నారని కవిత అన్నారు. "మహాసముద్రం లాంటి కాళేశ్వరంలో చిన్న పార్ట్ అయిన మేడిగడ్డలో మూడు పిల్లర్లు కుంగిపోతే.. ప్రాజెక్టు మొత్తం కూలిపోయిందని రెండున్నరేళ్లుగా లొల్లి పెడుతున్నారు. నేను 2006 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొంటూ రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నాను. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రజల విషయం తప్ప.. వ్యక్తిగత విషయాలు మాట్లాడరు. అటువంటి మహానాయకుడు అవినీతికి పాల్పడ్డారని, లక్ష కోట్లు దోచుకున్నారని, నిజాం కన్నా ధనికుడు కావాలనుకున్నారని అంటున్నారు. అవును కచ్చితంగా నిజాం బాటలోనే నడుస్తాం. నిజాం కట్టిన ఉస్మాన్‌సాగర్ నీళ్లే కదా.. నేటికీ హైదరాబాద్ ప్రజలు తాగుతున్నది! ఆ నిజాం స్ఫూర్తి అని మా నాన్న చాలాసార్లు చెప్పారు. కచ్చితంగా 200 ఏళ్లు తెలంగాణ ప్రజలు కాళేశ్వరం ప్రాజెక్టును కట్టిన కేసీఆర్‌ను తలుచుకుంటారు. కేసీఆర్‌కు ఉన్న అవగాహన, ఉమ్మడి ఏపీలో ఆయన అనుభవించిన వివక్ష, తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేసిన ప్రస్తుత సీఎంకు తెలియదు. నేటికీ ఆయన పక్క రాష్ట్రం ఎజెండాను అమలు చేస్తున్న వ్యక్తి. బనకచర్ల కడతామంటే మాట్లాడని వ్యక్తి.. కేసీఆర్ గురించి అసెంబ్లీలో ఉదయం నుంచి రాత్రి వరకు అనరాని మాటలు అంటుంటే నా గుండె బరువెక్కింది. ఇదే రేవంత్‌రెడ్డి గతంలో ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'కేసీఆర్‌కు పైసల మీద ఆశలేదు. పాపం ఆయన మీటింగ్ పెట్టాలంటే కూడా.. అప్పుడు పైసల గురించి చూస్తారు' అన్నారు. అటువంటి ఆలోచన ఉన్న వ్యక్తిమీద ఇంత కుట్రపూరితంగా అభాండాలు ఎందుకు వేస్తున్నారు? ప్రజలు తిరగబడతారనుకుంటే.. ప్రభుత్వం తప్పులు బయటపడతాయంటే.. కేసీఆర్‌పై ఆరోపణ చేయాలి. ఆయన పేరు చెప్పకుంటే రేవంత్‌రెడ్డి ఫొటో కూడా పేపర్లో వేయరని ఆయన్ను విమర్శిస్తున్నారు. సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు పెడతామని, 50శాతం రిజర్వేషన్లు ఎత్తేస్తామని అంటున్నారు. రాహుల్‌గాంధీ బిహార్ ఎన్నికల ప్రచారం కోసం బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ రోజుకో కొత్తకథ చెబుతోంది. గవర్నర్ వద్ద పెండింగ్ పెడితే.. సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లడంలేదు? బిహార్ ఎన్నికల కోసమే బీసీ బిడ్డలను రేవంత్‌రెడ్డి బలి పెడుతున్నారు. ఇలాగే చేస్తే.. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిహార్‌కు వెళ్లి ప్రచారం చేస్తాం" అని కవిత హెచ్చరించారు.

కవిత

సస్పెన్షన్ ఖాయం!?

నేడో, రేపో బీఆర్ఎస్ నుంచి ప్రకటన!.. కీలక నేతలతో అధినేత కేసీఆర్ భేటీ

- ఉపేక్షిస్తే పార్టీకి మరింత నష్టం అనే అభిప్రాయం
- ఎక్స్‌లో కవితను అన్‌ఫాలో చేయాలని ఆదేశం
- టీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వో అవుట్
- సస్పెండైతే తెలంగాణ జాగృతి పేరుతో కవిత సొంత పార్టీ?



హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీకి చెందిన నేతలు హరీశ్‌రావు, జోగినపల్లి సంతోష్ కుమార్‌పై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. కవిత తీరుతో పార్టీకి మరింత నష్టం జరిగేలోపే ఆమెను బీఆర్ఎస్ నుంచి సాగనంపాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్టీ నుంచి కవిత సస్పెన్షన్ ఖాయం అనే ప్రచారం బీఆర్ఎస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. దీనిపై ఒక ట్రెండు రోజుల్లో బీఆర్ఎస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మీడియా సమావేశంలో హరీశ్, సంతోష్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు చేశాక.. ఆ పార్టీ సీనియర్ నేతలు ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు వెళ్లారు. అక్కడ కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు మరికొందరు కీలకనేతలు కేసీఆర్‌తో భేటీ అయ్యారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. కవిత పార్టీలో ఉంటే లాభం ఉందా? అంటూ పార్టీ నేతలను కేసీఆర్ ప్రశ్నించారు. ఇంత పెద్ద వ్యాఖ్యలు చేశాక కూడా కవితను కొనసాగిస్తే పార్టీకి మరింత నష్టం అని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మెజారిటీ నేతలు కేసీఆర్‌కు సూచించారు. కవితను పార్టీలో కొనసాగితే విపక్షాలకు ఆయుధం ఇచ్చినట్లేనని నేతలు అభిప్రాయపడ్డారు. కవితపై ఎటువంటి చర్యలు తీసుకోకపోతే ముందు మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందని అధినేతకు చెప్పారు. కవిత ఇదివరకే.. కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయంటూ వ్యాఖ్యానించారు. అప్పుడే ఆమెపై నిర్ణయం తీసుకుంటారని అంతా భావించారు. అయితే ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటేనే తక్కువ నష్టం జరుగుతుందనే భావన అప్పట్లో పార్టీ పెద్దల్లో ఉండిందని.. ఇప్పుడు చేయిదాటిపోయే స్థాయికి పరిస్థితి చేరిందని ఓ కీలక నేత చెప్పారు.

కవితపై బీఆర్ఎస్ నేతల మాటల దాడి

సామాజిక మాధ్యమాల్లో కవితను వెంటనే అన్‌ఫాలో కావాలని బీఆర్ఎస్ ఐటీ విభాగం నుంచి పార్టీ శ్రేణులకు ఆదేశాలు వెళ్లినట్లు గులాబీ వర్గాలు చెబుతున్నాయి. ఆ వెంటనే ఎక్స్ ఖాతాలో కవితను ఫాలో అవుతున్న కార్యకర్తలు వెంటవెంటనే అన్‌ఫాలో అయ్యారు. సామాజిక మాధ్యమాల్లో ఆమెకు వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం మొదలుపెట్టారు. ఎలక్ట్రానిక్ మీడియాలో బీఆర్ఎస్ తరఫున చర్చలకు వెళ్లిన నేతలు కూడా కవిత తీరును తీవ్రంగా తప్పుబట్టారు. కొందరైతే కవిత తీరు వల్లే గత ఎన్నికల్లో పార్టీ ఘోర పరాజయం పాలైందని ఆరోపించారు. మరికొందరు తక్షణమే ఆమె పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ఎల్పీ వాట్సప్ గ్రూప్ నుంచి కవిత పీఆర్వోను తొలగించారు. హరీశ్‌రావు ఆరడుగుల బుల్లెట్ అంటూ బీఆర్ఎస్ సోషల్ మీడియా విభాగం పోస్టులు పెట్టింది. లండన్ పర్యటనలో ఉన్న హరీశ్‌రావుకు అక్కడి బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగం ఘనస్వాగతం పలికింది.

సస్పెండ్ చేస్తే సొంతపార్టీ?

బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేస్తే ఆమె అడుగులు ఎటువైపు? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. అయితే మొదట్నుంచి ఆమె ఒక స్పష్టతతో ఉన్నారని, పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే, సొంత వేదిక ఏర్పాటు చేసుకోవాలని ముందే నిర్ణయం తీసుకున్నారని విశ్లేషకులు అంటున్నారు. 2023 ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆమె తన జాగృతి సంస్థను నెమ్మదిగా బలోపేతం చేస్తూ వస్తున్నారు. జాగృతి పేరుతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ పెడితే తెలంగాణ జాగృతినే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశం ఉందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. కొత్త పేరు జోలికి వెళ్లకపోవచ్చని ఆ వర్గాలు అంటున్నాయి.

పాల్వంచ గద్దర్‌బాషాకు జానపద పురస్కారం



బాషాను సత్కరిస్తున్న దృశ్యం

పాల్వంచ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జానపద కళారంగంలో విశేష సేవలందించిన పాల్వంచ గద్దర్‌గా పిలుచుకునే జానపద కళాకారుడు గద్దర్‌బాషాకు జానపద పురస్కారం దక్కింది. ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హైదరాబాదులోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర జనపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జానపద వేడుకలు ఘనంగా నిర్వహించారు. జానపద కళారంగంలో సేవలందించినందుకు గాను బాషాను నిర్వాహకులు శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళాకారుల సంఘం గౌరవ సలహాదారుడు సారుపల్లి కొండలరావు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వంగా శ్రీనివాస్‌గౌడ్, సుంచు లింగయ్య, పమ్మి రవి, నారాయణ పాల్గొనగా జిల్లా జానపద కవులు, కళాకారులు కొమరయ్య, జానకిరామ్, ఖాసీం, దండోరా శ్రీను, కొండలరావు, సాగి వెంకన్న, అలవాల నందు తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

జేకే5 ఓసీకి రక్షణ అవార్డులు



అవార్డు అందుకుంటున్న సింగరేణి అధికారులు

ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే5 ఓసీ రక్షణలో ప్రథమ బహుమతి లభించింది. సింగరేణి స్థాయి 55వ రక్షణ వారోత్సవాల సందర్భంగా ఉపరితల గనుల్లో రక్షణలో అత్యుత్తమ ప్రతిభ కరబరిచిన జేకే 5 మొదటి స్థానంలో నిలిచింది. సోమవారం శ్రీరాంపూర్‌లో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్ నాయక్ చేతుల మీదుగా ఏరియా జీఎం కృష్ణయ్య రక్షణ అవార్డు అందుకున్నారు. జీఎంతో పాటు గని మేనేజర్ పూర్ణచందర్‌రావు, రక్షణ అధికారులు జాకీర్ హుస్సేన్, శివప్రసాదరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతరామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్నారు.

డెంగీతో యువతి మృతి



ప్రవళిక (ఫైల్)

గుండాల, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ జ్వరం బారిన పడి ఓ యువతి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఇర్ప ప్రవళిక(16) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతుంది. వారం రోజుల నుండి జ్వరం వస్తుండటంతో ఇంటికి వచ్చింది. గత మూడు రోజుల క్రితం స్పృహతప్పి పడిపోవడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేసిన సిబ్బంది ప్రవళికకు డెంగ్యూ ఉన్నట్లు నిర్ధారించారు. చికిత్స చేస్తున్నప్పటికీ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం ఆమె మృతి చెందింది.

చేపల వేటకు వెళ్లి యువకుడు..

చర్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన బండి బాబు (25) అనే యువకుడు మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రాళ్ళగూడెం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలో గత రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గ్రామశివారులోని వాగు వద్దకు బాబు అనే యువకుడు చేపలు పట్టేందుకు వెళ్ళాడు. ఇదే క్రమంలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వాగులో పడి గల్లంతయ్యాడని స్థానికులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే చర్ల పోలీసులు అక్కడికి చేరకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

గోదావరి తీరంలో..

నిమజ్జన సందడి

రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి తరలివస్తున్న విగ్రహాలు

పటిష్ఠ ఏర్పాట్లు చేసిన యంత్రాంగం



భద్రాచలంలో గోదావరి వద్ద నిమజ్జన ఘాట్‌లో వినాయక విగ్రహాల సందడి

భద్రాచలం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని పవిత్ర గోదావరి నదిలో సోమవారం గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా విగ్రహాలు వివిధ ప్రాంతాల నుంచి కోలాహలంగా తరలివస్తున్నాయి. మోరియారే బప్పా మోరియారే..గణపతి బప్పామోరియా... జై గణేష్ జై జై గణేష్ అంటూ భక్తుల నామస్మరణల మధ్య ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం పులకరించింది. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఎటుచూసినా గణేష్ నిమజ్జనంకు తరలివచ్చిన భక్తులు. గణనాధులతో పండుగ వాతావరణం నెలకొంది. భద్రాచలం, కొత్తగూడెం, పాల్వంచ తదితర ప్రాంతాల నుంచి గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు తీసుకొస్తున్నారు. ఆరో రోజు కావడంతో గణేష్ విగ్రహాల నిమజ్జనం వేగం పుంజుకోనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా గణేష్ నిమజ్జనంకు ఐటీసీ నుంచి క్రేన్లు, ఒక బ్లేడ్ ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను ప్రస్తుతం వినియోగిస్తున్నారు. కాగా ఇంకా కొత్తగూడెంలోని సింగరేణి నుంచి ఐదు ఎక్స్‌కవేటర్లు, రెండు క్రేన్లు రావాల్సి ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తులను నిమజ్జన ఘాట్‌కు ముందే పోలీసులు వివిధ శాఖల సిబ్బంది నియంత్రిస్తున్నారు. అలాగే తెలంగాణ అగ్నిమాపక శాఖకు చెందిన రెస్క్యూ బృందం, అంబులెన్సును సైతం అందుబాటులో ఉంచారు. అలాగే విద్యుత్తు దీపాలను కూడా ఏర్పాటు చేశారు. గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుండటంతో భక్తులను గోదావరిలో స్నానాలు చేసేందుకు అనుమతించకుండా షవర్లు ఏర్పాటు చేసి అనుమతిస్తున్నారు. ఇదిలా ఉండగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయగా గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నారు.

రామయ్య దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు



నిమజ్జనానికి విగ్రహాలను తరలిస్తున్న దృశ్యం

గణేష్ నిమజ్జనంకు వచ్చిన భక్తులు రామయ్యను దర్శించుకునేందుకు రానుండటంతో భద్రాద్రి దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో ఐదో తేదీ నుంచి ఏడో తేదీ వరకు ఉదయం 4 గంటలకే ఆలయాన్ని తెరిచి భక్తులను దర్శనార్థం అనుమతించనున్నారు. అలాగే భక్తుల రాకకు అనుగుణంగా లడ్డూ తయారీని చేపడుతున్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కనీసం 50వేల లడ్డూలు ఉండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పరిపాలన విభాగంలో విధులు నిర్వహిస్తున్న 20 మందికి ఆలయంలో ప్రత్యేక విధుల్లో నియమించారు.

కిన్నెరసాని ప్రాజెక్టుకు పోటెత్తిన వరద

406 అడుగులకు చేరిన నీటి మట్టం

3 గేట్లు ఎత్తి 10,600వేల క్యూసెక్కులు విడుదల



కిన్నెరసాని గేట్లు ఎత్తిన దృశ్యం

పాల్వంచ రూరల్, సెప్టంబర్1 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి వరదనీరు పోటెత్తింది. ఆదివారం రాత్రి భారీ వర్షం పడటంతో నీటిమట్టం 406 అడుగులు పెరిగింది. మహబూబాబాద్, పాకాలకొత్తగూడెం, గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం మండలాల్లోని అటవీ ప్రాంతంలో గల వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తు వరద నీరు ప్రాజెక్టుకు చేరింది. భారీగా వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయం అసలు సామర్థ్యం 407 అడుగులు కాగా 406 అడుగులు చేరడంతో జెన్కో, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు సమాచారం తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని అంచనా వేసుకుంటూ 3 గేట్లను ఎత్తి 10,600 క్యూసెకుల నీటిని విడుదల చేశారు. ఎగువ నుంచి వరద ఉధృతి పెరగడంతో దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేశారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంతాల్లోని బూర్గంపాడు, పాల్వంచ మండలాల ప్రజలు వాగులు దాట వద్దని హెచ్చరికలు జారీచేశారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలకు సమాచారం అందించారు. రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లను ఒడ్డుకు చేర్చుకోవాలని ఆదేశించారు.

తాలిపేరు పరవళ్లు

16 గేట్లు ఎత్తి 30వేల క్యూసెక్కుల నీరు విడుదల



తాలిపేరు ప్రాజెక్టు నుంచి పరవళ్లు తొక్కుతున్న నీరు

చర్ల, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి) : చర్ల మండలంలో రాత్రి కురిసిన భారీ వర్షానికి తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చిచేరింది. దీంతో అప్రమత్తమైన అధికారులు మంగళవారం ఉదయం ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గత రెండు రోజులుగా చర్ల మండలంలో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని కోటింత, తరివాగు, ఈత వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. అలాగే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు నీటి మట్టం ఘననీయంగా పెరుగుతోంది. కాగా వరదనీటిని అంచనా వేస్తున్న అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం 72.59 మీటర్లు కాగా, ఇన్‌ఫ్లో 24వేల క్యూసెక్కులుగా ఉందని డీఈ తిరుపతి తెలిపారు.

మహిళల అభ్యున్నతికి కృషిచేద్దాం

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అవసరమైన స్థలాలను ఎంపిక చేయాలి

ఇందిరా మహిళాశక్తిపై అధికారులతో అదనపు కలెక్టర్ శ్రీజ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబర్1 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతికి సమిష్టిగా కృషిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరా మహిళా శక్తిపై సోమవారం ఆమె అధికారులతో సమీక్షించారు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ, కొత్త స్వశక్తి సంఘాలఏర్పాటు, బ్యాంకు లింకేజీ రుణాలు, యూనిఫారం కుట్టు పనులు, ఎర్రుపాలెం, కల్లూరులో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు, పెట్రోల్‌బంక్ ఏర్పాటు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షిస్తూ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ అక్షరాస్యత పెంచే దిశగా పదవ తరగతి ఉత్తీర్ణత సాధించని మహిళలను గుర్తించి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో నమోదు చేయాలన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అర్బన్ ప్రాంతాల్లో అనువైన స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. సత్తుపల్లి పట్టణంలో ఎంపిక చేసిన స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎన్.సన్యాసయ్య, డీపీఎం, ఏపీఎంలు పాల్గొన్నారు.

మళ్లీ 20 అడుగులకు పెరిగిన వైరా రిజర్వాయర్ నీటిమట్టం



మత్తడి పోస్తున్న అలుగు

వైరా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ నీటి మట్టం మళ్లీ పెరిగింది. సోమవారం సాయంత్రానికి ఈ నీటి మట్టం 20 అడుగులకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి తర్వాత వైరా రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంల్లో కురిసిన కుండపోత వానతో ఏర్లు, వాగుల నుంచి భారీగా వరదనీరు వచ్చి చేరింది. దాంతో 19.2 అడుగులు ఉన్న నీటిమట్టం 20 అడుగులకు చేరింది. వైరా నది వరదతో పరవళ్లు తొక్కుతుంది. ఇక్కడ 51.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

యూరియా కొరత లేకుండా ఏర్పాట్లు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు కావాల్సిన యూరియా అందిస్తున్నట్టు ఏవో సీతారాంరెడ్డి తెలిపారు. మండలంలోని 14 కేంద్రాల్లో యూరియా అందజేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని వెదుళ్లచెరువు, బాలాజీనగర్‌తండా , జల్లేపల్లి, చంద్రుతండా, జోగులపాడు, బంధంపల్లి, ఏలువారిగూడెం, మేడిదపల్లి, కొక్కిరేణి, ఎర్రగడ్డ, తాళ్లచెరువు, దమ్మాయిగూడెం,కేశ్వాపురం, గోల్‌తండా, హైదర్‌సాయిపేట, బచ్చోడు, జూపెడ , బచ్చోడుతండా, గోపాలపురం,పైనంపల్లి, రాజారం, సోలిపురం, కాకరవాయి తదితర గ్రామాల్లో సహకార సంఘాల్లో యూరియా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

పార్కింగ్ అస్తవ్యస్తం

- ప్రభుత్వాస్పత్రిలో ఎక్కడి వాహనాలు అక్కడే
- రూ.20లక్షలతో ఏర్పాటు చేసిన స్థలం వృథా

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పార్కింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది.అస్పత్రికి వచ్చే సిబ్బంది, ఉద్యోగులు, రోగులు వారి బంధువులు వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్క్ చేస్తుండటంతో అత్యవసర సమయంలో వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితులను అధిగమించేందుకు గత ఏడాది అప్పటి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పార్కింగ్ కోసం రూ.20లక్షల నిధులు మంజూరి చేసి ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించారు. దాన్ని వినియోగించడంలో ఆస్పత్రి అధికారులు విఫలమయ్యారు. ప్రజా సొమ్ము వృథాగా మారింది. దీంతో ఆ పార్కింగ్ స్థలం పశువులు పడుకునే స్థలంగా మారిపోయింది.

రోగుల తాకిడి ఎక్కువే

జిల్లా ఆస్పత్రికి ప్రతినిత్యం రోగుల తాకిడి ఉంటోంది. రోజు కనీసం 1600 నుంచి 2వేల మంది వరకు వస్తుంటారు. వీరితో పాటు సహాయకులు బంధువులు, ఆస్పత్రి సిబ్బందితో మొత్తంగా నిత్యం వచ్చే 4వేల మందితో రద్దీ ఉంటుంది. ఆస్పత్రి ఆవరణంలో ద్విచక్ర వాహనదారులు, కార్లు యథేచ్ఛగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోగులు, సహాయకులు కూర్చోవడానికే కాదు ఒక్కోసారి నడవడానికికూడా వీల్లేకుండా పోతోంది. జిల్లాఆస్పత్రిలో పార్కింగ్ బాధ్యతలను స్థంభాద్రి పట్టణ దివ్యాంగుల సమాఖ్యకు అప్పగించారు. ఈగ్రూపునకు చెందిన పదిమంది దివ్యాంగులు వాహనదారుల వద్ద నుంచి రుసుము వసూలు చేస్తున్నా వాహనదారులు వారిమాట పట్టించుకోవట్లేదు. యథేచ్ఛగా పార్కింగ్ చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ముఖ్యంగా జనరల్ ఆస్పత్రి, మాత శిశుసంరక్షణ కేంద్రం, టీబీ హాస్పిటల్, మార్చురీ, సఖీ కేంద్రం, ట్రామా కేర్ సెంటర్, ల్యాబ్, పల్లెప్రకృతి వనంలోనూ వాహనాలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది కార్లు, ద్విచక్ర వాహనాలను సైతం నిర్దేశించిన పార్కింగ్ స్థలంలో కాకుండా ఆవరణంలో నిలుపుతుండడంతో పరిస్థితి చేదాటిపోతోంది. ఇప్పటికైనా ఆస్పత్రిలో వాహనాల పార్కింగ్ కోసం విశాలమైన స్థలం కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది.




ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో గేదెలు ఉన్న దృశ్యం, ఆవరణంలో అస్తవ్యస్తంగా నిలిపిన వాహనాలు

వసతికి వరద

- పర్యవేక్షణలేని ఎస్సీ సంక్షేమ హాస్టల్ తీరు
- ప్రైవేటు వ్యక్తులతో వంట పనులు
- నెలల తరబడి సెలవులో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఈచిత్రాలలోని విద్యార్థులు ఏదో నీటితో నిండిన వాగు, వరద కాల్వ దాటుతున్నారనుకుంటే మీరు పొరబడినట్లే.. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహం నుంచి బడికి వెళ్లేందుకు వారు పడుతున్న ఇబ్బందులు ఇవీ.. ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డుకు సమీపంలో ప్రత్యేక బాలుర వసతి గృహాన్ని సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పదేళ్లుగా ఎంతో ఆదర్శంగా వసతిగృహం నిర్వాహణ ఉంది. ఉమ్మడి జిల్లాలోనే 140 మంది విద్యార్థులతో కలకలాడుతూ 95శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించేది అయితే ఇదంతా గతం. ఇప్పుడు వసతిగృహం తీరు అధ్వానంగా మారిపోయింది. వసతిగృహంలోకి బయట నుంచి వరద నీరు చేరి వసతిగృహం చుట్టూ నిండిపోయింది. విద్యార్థులు బయటకు రావాలన్నా. వసతిగృహంలో కనీసం నడవాలన్నా వరద నీటిలో నుంచి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక వసతిగృహంలో వంట చేయాల్సిన ఉద్యోగులు పలు అనారోగ్య కారణాలతో నెలల తరబడి ప్రైవేటు వ్యక్తులతో వంటలు చేయిస్తున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేయాల్సిన వంట పనులను నెలకు రూ.5వేలు ఇచ్చి ప్రైయివేటు వ్యక్తులను పనులు చేయిస్తున్నారు. ఈ సందర్భంలో వంటశాలలోకి విద్యార్థులను పిలిపించి వారితో వంట సహాయం తీసుకుంటున్నారు.




వసతిగృహం నుంచి వరదలో బయటకు వస్తున్న విద్యార్థులు, శుభ్రం చేస్తున్న ప్రైవేటు వ్యక్తి

పాఠశాలలోకి వర్షపు నీరు



కామేపల్లి: కామేపల్లి మండలం ఎంజేపల్లి ఎంపీపీఎస్ పాఠశాల, మర్రిగూడెం పాటశాల ఆవరణలోకి వర్షం నీరు వచ్చి చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాలలో నీరు చేరుతుంది. పాఠశాల ఆవరణ రోడ్డుకు లోతట్టులో ఉండడంతో పాఠశాలలో నీరు నిల్వ ఉంటుంది. మూడు, నాలుగు ఏళ్లగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే మోకాలు లోతు వరద ఉంటుంది. కలెక్టర్ దృష్టి సారించి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

భారీవర్షం



ఆకేరు చెక్‌డ్యాం వద్ద వరద

తిరుమలాయపాలెం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం అర్ధ రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీవర్షంతో మండలంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఇటీవల భారీవర్షాలతో చెరువుల, కుంటలు అలుగు పోశాయి. ఆకేరు, పాలేరు నదులపై ఏర్పాటు చేసిన చెక్‌డ్యాంలు కూడా పొంగి ప్రవహిస్తున్నాయి.

రహదారిపై నాటు వేసి నిరసన



ఖమ్మంరూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిశెట్టిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని డాక్యాతండా గ్రామంలో ప్రధాన రహదారి బురదమయంగా మారింది. ఈ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి.పొలిశెట్టిగూడెం వెళ్లేందుకు, ఇటు తీర్థాల ఖమ్మం వచ్చేందుకు డాక్యాతండా మీదుగా రావడమే ప్రధాన రహదారి. అయితే ఈ రహదారి బురదమయంగా మారి ఏడాది గడుస్తున్నా పాలకులు పట్టించుకోవడంలేదు. దీంతో సోమవారం గ్రామస్తులు రహదారిపై ఉన్న బురదలోనే నాటు వేసి నిరసన తెలిపారు.

ప్రజాఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి):ప్రజావాణిలో ప్రజలు అందించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణిలో వారుప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆయాశాఖల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ పద్మశ్రీ,జడ్పీ సీఈఓ దీక్షారైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య జిల్లా అధికారులు కారుమంచి శ్రీనివాసరావు, డీపీవో ఆశాలత తదితరులు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన పి.కావ్య తనకు కల్లూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో 7వతరగతి సీటు ఇప్పించాలని దరఖాస్తు చేసుకుంది.
- సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ, లింగంబంజర గ్రామస్థులు గ్రామంలో గతం నుంచి ఉన్న రోడ్డును ట్రాక్టర్ ద్వారా దున్ని ఆనవాళ్ల లేకుండా చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామానికి చెందిన జి.సత్యనారాయణ పుట్టకోట చెరువు 50ఎకరాలు ఆక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, చెరువు సుందరీకరణ, ఆధునీకరణ పనులు చేపట్టాలని విన్నవించారు.




ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

తాగునీరివ్వండి

గరిడేపల్లిలో బిందెలతో ధర్నా



గరిడేపల్లిలో ధర్నా చేస్తున్న గ్రామస్థులు

కామేపల్లి,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని గరిడేపల్లి గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్థులు ఖాళీ బిందెలతో సోమవారం ధర్నా చేశారు.. గ్రామంలో నెలరోజులుగా మంచి నీటి సమస్య ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వానకాలంలోతాగునీటి సమస్య ఉండటం దారుణమని అన్నారు. గ్రామంలో కనీసం మిషన్ భగిరథ నీరు కూడా సరఫరా చేయడం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శికి, అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. కామేపల్లి మండల కేంద్రానికి చిట్ట చివర గ్రామం కావడంతోనే మమ్మల్ని పట్టించు కోవడలేదని ఆరోపిస్తున్నారు. కనీసం డోర్నకల్ మండలనికి చెందిన మిషన్ భగిరథ పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇస్తే సమస్య తొలగిపోతుందని తెలిపారు.

చంద్రబాబు విజనరీ నేత

ఖమ్మంమామిళ్లగూడెం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగురాష్ట్రాల అభిమాననేత, టీడీపీ జాతీయ నాయకులు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విజనరీ నేత అని టీడీపీ నాయకులు కేతినేని హరీష్ అన్నారు. ఆయన పరిపాలన దక్షత అన్ని రాష్ట్రాలకు ఆదర్శమన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నేటికీ 30సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్‌కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.

గణేష్ మండపాల్లో అన్నదానం



హరివిల్లు అపార్టుమెంట్‌లో సరస్వతీ పూజ




అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సీపీ సునీల్‌దత్, మోతీనగర్‌లో బ్లూస్టార్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



గణేష్ పూజలో పాల్గొన్న భక్తులు




బాలు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంలో దంపతుల పూజ

గ్రామాల్లో అపరిశుభ్రత..

ఆసుప్రతుల్లో రోగుల కిటకిట

నేలకొండపల్లి సీహెచ్‌సీకి పోటెత్తిన జ్వరపీడితులు

నేలకొండపల్లి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది.. ఈ నేపథ్యంలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. రెండు వారాలుగా నేలకొండపల్లిసీహెచ్‌సీ జ్వరపీడితులతో నిండిపోతోంది. ప్రతీ రోజూ ప్రభుత్వ వైద్యశాలకు దాదాపుగా 300మందికి తక్కువగాకుండా రోగులు పరీక్షల కోసం వస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్న వారిలో ఎక్కువ మంది జ్వరంతో బాధ పడుతున్న వారు ఉంటున్నారు. గతనెల 25న ఎక్కువగా 438 మంది రోగులు రాగా అందులో 133 మందిని ఇన్‌పేషేంట్లుగా ఉంచి చికిత్స అందించారు. మొత్తంగా పెద్ద సంఖ్యలో రోగులు ప్రభుత్వ వైద్యశాలకు వస్తున్నారు.

పడకేసిన పారిశుధ్యం

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. గ్రామాల్లో పారిశుధ్య పనులు దాదాపుగా శూన్యమనే చెప్పాలి. పంచాయతీల్లో నిధులు లేక పోవటంతో కార్యదర్శులు చేతులెత్తేస్తున్నారు. అధికారుల వత్తిడితో చిన్న చిన్న పనులకు కార్యదర్శులు చేతి నుంచే ఖర్చు చేస్తున్నట్లుగా సమాచారం. ప్రభుత్వం నిధులను విడుదల చేసి పారిశుధ్య పనులను వేగంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వైద్యశాలకు పరీక్షల కోసం వచ్చిన రోగులు

'ఉభయం'తో ఆర్థిక ప్రయోజనాలు

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి):ఉభయం ధ్రువపత్రాలతో ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని ఖమ్మం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, పట్టణ మిషన్ కో ఆర్డినేటర్ గుడిపూడి సుజాతరాణి వివరించారు. సోమవారం కేఎంసీ మెప్మా సమావేశ మందిరంలో ఆర్పీల సమావేశంలో టీఎంసీ మాట్లాడారు. ఉభయం ధ్రువీకరణ పత్రాల పంపిణీ ద్వారా వ్యాపారులకు అందే ఆర్థిక వ్యాపార ప్రయోజనాలను వివరించారు. ప్రతీఎస్‌హెచ్‌జీ వ్యాపారం బ్యాంకర్లుకు వెళ్తుందని తద్వారాతిరిగి అధికఆర్థిక రుణాలు ఇవ్వటానికి అవకాశం ఉందని వివరించారు. అలాగే ఆర్పీల కొత్తసంఘాల లక్ష్యాలపై సమీక్షించారు. ఆర్పీల ఉద్యోగ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. సీవోలు సల్మా, గోప్పాజి ఉపేంద్ర, చిలకా ద్రౌపది, బొల్లికొండ రోజా పాల్గొన్నారు.

7,8 తేదీల్లో రోలర్ స్కేటింగ్ జట్ల ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా రోలర్ స్కేటింగ్ జట్లను ఈనెల 7, 8 తేదీల్లో నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు స్కేటింగ్ కోచ్ సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి అక్టోబరులో జరిగే రాష్ట్రపోటీలకు పంపుతామని తెలిపారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా వెంకటేశ్వర్లు

ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా పూనాటి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారి, అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీగా పని చేసిన నర్సిం హమూర్తి ఇటీవల రిటైర్ అయ్యారు.

రిటైర్డ్ ఉద్యోగులకు అదనపు కలెక్టర్ సన్మానం

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): నిర్విరామ ప్రజలకు ప్రభుత్వ పరంగా సేవలు అందించే అవకాశం ఉద్యోగులకు మాత్రమే దక్కుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆగస్టులో పదవి విరమణ పొందిన 10మంది ఉద్యోగుల పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, ముదిగొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, శాంతినగర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ చాంద్‌పాషా, హార్టికల్చర్‌శాఖ ఆఫీస్ సబార్డినేట్ వెంకటేశ్వరరావు, గిరిజన శాఖ హెచ్‌ఎం కొర్ర శివ, వైద్య ఆరోగ్య శాఖకు చెందిన డిప్యూటీ డెమో సాంబశివరెడ్డి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించారు.

రేపటినుంచి సొసైటీల ద్వారా యూరియా పంపిణీ

- పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలి
- నేలకొండపల్లి ఏవో రాధ



నేలకొండపల్లి,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): పాలేరు నియోజకవర్గంలో బుధవారం నుంచి సొసైటీకేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.రాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఠాపురం, రాజేశ్వరపురం, నాచేపల్లి, నేలకొండపల్లి, చెన్నారం, రామచంద్రాపురం, చెరువుమాధారం, పైనంపల్లి, బోదులబండ, మండ్రాజుపల్లి సొసైటీలతో పాటు నాచేపల్లి సొసైటీ పరిధిలోని ముజ్జుగూడెం, చెర్వుమాధారం సొసైటీ పరిధిలోని మంగాపురంతండా, నేలకొండపల్లి సొసైటీ పరిధిలోని అప్పలనర్సింహాపురంలతో పాటుగా కొత్తగా ఏర్పాటు చేసిన సొసైటీ సబ్-సెంటర్‌ల నుంచి సైతం యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏఓ ప్రకటనలో తెలిపారు. రైతులు యూరియా కోసం వచ్చే సమయంలో పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను వెంట తెచ్చుకోవాలని సూచించారు. రైతు వస్తే ఈపాస్ మిషన్‌లో వేలి ముద్ర ద్వారా యూరియా ఇస్తారని, రైతులు రాలేని పక్షంలో కుటుంబ సభ్యులు వస్తే వారి మొబైల్‌కు వచ్చే ఓటీపీని చెప్పే విధంగా చూసుకోవాలని ఏఓ సూచించారు. ఆయా గ్రామాల రైతులు అధికారులు సూచించిన సెంటర్ వద్ద మాత్రమే యూరియా తీసుకోవాలన్నారు. తప్ప వేరే సెంటర్ వద్దకు వెళ్తే ఇవ్వరన్న విషయాన్ని గుర్తించాలన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

పాలేరు డివిజన్ సీపీఎం కార్యదర్శి రమేష్

ఖమ్మంరూరల్, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లుకేటాయించాలని పాలేరు డివిజన్ సీపీఎం కార్యదర్శి బండి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడాన్ని నిరసిస్తూ జలగంనగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలో మొత్తం 65గ్రామాల్లో సర్వే నిర్వహించిందన్నారు. కాగా అనర్హులకు ఇళ్లు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. యూరియా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే కేంద్రంతో పోట్లాడైనా యూరియా సాధించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు నండ్రా ప్రసాద్, నాయకులు పి.సంగయ్య, మోహన్‌రావు, నాగేశ్వరరావు, పెద్ద వెంకటరెడ్డి, సుమతి, పి.సత్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు జలవనరులశాఖ ఈఈగా సురేష్‌బాబు



కల్లూరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): కల్లూరు జలవనరులశాఖ డివిజన్ కార్యాలయంలో ఈఈగా జి. సురేష్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈఈ గా పనిచేసిన లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో ఈఈ పోస్టు గత నాలుగు నెలల నుంచి ఖాళీగా ఉంది. దీంతో గతంలో గద్వేల్‌లో డీఈఈగా పనిచేసిన సురేష్‌బాబు పదోన్నతిపై కల్లూరు డివిజన్‌కు ఈఈగా వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజల ఆరోగ్యాలను పట్టించుకోని ప్రభుత్వం

» మాజీ ఎమ్మెల్యే చంద్రావతి



కూచిపుడి హరిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న చంద్రావతి

కొణిజర్ల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): తుఫాన్ల తర్వాత పల్లెల్లో పారిశుధ్య లోపంతో డెంగ్యూ, మలేరియా, పాముకాటు వంటి ప్రమాదకర వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి మండిపడ్డారు. సోమవారం ఆమె మండలంలోని పెద్దగోపతి, కొణిజర్ల ఆరోగ్యకేంద్రాలను సందర్శించారు. తనికెళ్లలో ఇటీవల మృతి చెందిన మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యం అందక ఎందరో పేదలు అనారోగ్యంతో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అవసరమైన మందులు మెరుగైన ఆసుపత్రి సౌకర్యాలు కలిపించేందుకు ప్రభుత్వాలు తక్షణమే కార్యచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలని ధర్నా

కొణిజర్ల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని తనికెళ్ల పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు తాళ్ళపల్లి కృష్ణ, మెరుగు రమణ మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి రవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చల్లా నారాయణ, యాసా రామారావు, పెదమళ్ళ పద్మినీతిలకం, తాళ్ళపల్లి విజయ, అన్నారపు వెంకటేశ్వర్లు, యాసా వెంకటేశ్వర్లు, పుప్పాల సీతారావమ్మ, మాదిన్ని వెంకటరమణ, నాగలక్ష్మీ, సైదాబి, సుధా, స్వాతి, ధనమ్మ పాల్గొన్నారు.

వ్యాసరచనలో జేవీఆర్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేజర్లకు చెందిన శ్రీ బాలగంగాధర తిలక్ స్మారక గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలో స్థానిక జేవీఆర్ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతిని గెలుచుకున్నారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో ప్రథమ సంవత్సరం బీఏ విద్యార్థులు క్విజ్‌లో రూ.2వేల నగదు పురస్కారం అందుకున్నారు. విజేతలు మంజులతాదేవి, ఆయిషా, తిరుపతిరాజు, అనుప్రియ, రామంజి, తౌసిఫ్‌లతో పాటు వ్యాసరచనలో ఎంపీపీఎస్ విద్యార్థిని కల్పన తృతీయ బహుమతి సాధించింది. విజేతలను ప్రిన్సిపాల్ డా.ఎన్.గోపి, అధ్యాపకులు అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కల్లూరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాల బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ కల్లూరులో సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ధర్నాలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు పాల్గొని మాట్లాడారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్‌కు, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దమాల దయాకర్‌తో పాటుగా తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ముదిగొండ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని చిరుమర్రి గ్రామపంచాయతీ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు బండి రమేష్, బండి పద్మ మాట్లాడారు. అనంతరం గ్రామంలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సామినేని రామారావు, కోలేటి ఉపేందర్, కోలేటి అరుణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొణిజర్ల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మిత్రుడి అనారోగ్యంతో బాధపడుతుండడంతో తెలుసుకున్న తోటి మిత్రులు తన మిత్రుడికి కొంత అండగా నిలిచారు. మండలంలోని బొట్లకుంట గ్రామానికి చెందిన పాలెపు సైదులు భార్య అయిన ఉమ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న సైదులు మిత్రులు రూ.20వేల నగదు, 50ఏజీల బియ్యం అందించారు. ఈకార్యక్రమంలో ఉద్దండు సాహెబ్, కోయిన్ని రామారావు, నున్నా రామకృష్ణ, విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపు

కారేపల్లి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొక్కలతండా సమీపంలో మేనెల 2న గ్రామానికి చెందిన రైతు బానోత్ హతీరామ్‌కు చెందిన ఐదు గేదెలు మేతకోసం వెళ్లిన క్రమంలో విద్యుత్‌వైర్లను తాకి మృతి చెందాయి. ఈ విషయంపై రైతు సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులపై కేసు పెట్టారు. గ్రామానికి చెందిన హట్కర్ రాంబాబు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు వివరించారు. ఎమ్మెల్యే చొరవతో స్పందించిన అధికారులు రైతు హతీరామ్‌కు నష్టపరిహారంగా కొత్తలింగాల ఏడీ కార్యాలయంలో ఏడీ చేతుల మీదుగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో మండల ఏఈ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా లయన్స్ క్లబ్ సేవలు

కొణిజర్ల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలనే లక్ష్యంతో గ్రామస్థాయిలో కూడా లయన్స్ క్లబ్ సేవలు నిర్వహించడానికి నూతన క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు లయన్స్‌క్లబ్ వైరా పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్‌కాపా మురళీకృష్ణతెలిపారు. కొణిజర్లలో ఓ కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వై.బుచ్చి రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం లయన్స్‌క్లబ్ కొణిజర్ల అధ్యక్షుడిగా కొణతం శ్రీనివాసరావు, సెక్రటరీగా నరేష్, కోశాధికారిగా సంపత్‌లను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంఆలో మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, డాక్టర్ స్వర్ణ వాసు, ఉపేందర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలని ఆందోళన

బోనకల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక రైతు వేదికలో ప్రజావాణీ నిర్వహిస్తున్న అధికారుల ఎదుట దంపతులు రెండు గంటల పాటు బైఠాయించారు. మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన మండేపుడి బ్రహ్మం, రాణి దంపతులు తమ భూ సమస్యకు సంబంధించి రెండు సార్లు ప్రజావాణీలో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని, విసిగిపోయిన తాము చివరకు ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. సమస్యను తహసీల్దార్ ఎం. రమాదేవి పీఆర్, నీటి పారుదల శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు గడువు పెంపు

సత్తుపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశాలకు ఈనెల 12వరకు గడువు పొడిగించినట్లు స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ డాక్టర్ చీపు పూర్ణచంద్రరావు తెలిపారు. డిగ్రీలో చేరేందుకు ఇంటర్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్, డిప్లోమా పాసైన విద్యార్థులు అర్హులని, ఈ ఏడాది నుంచి ఎస్టీ కోయ, చెంచు, గోండు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత డిగ్రీ విద్యను అందజేయనుందని, ఇతర వివరాలకు 9491881910, 8187837058 సంప్రదించాలని కోరారు.

వర్షం.. వరదలు

» నీట మునిగిన పంటలు
» రాకపోకలకు అంతరాయం
» ఇళ్లలోకి చేరిన వరద

కొణిజర్ల,సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆదివారం, సోమవారం కురిసిన వర్షాలకు మండలంలోని పలు చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలో 68.4 ఎం.ఎం వర్షపాతం నమోదు అయింది.

కారేపల్లి: మండలంలో భారీ వర్షంతో పలు ప్రాంతాల్లో వాగులు పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుగ్గ వాగు సమీపంలోని ప్రజలను ఎంపీవో రవీంద్రప్రసాద్, ఎస్ఐ రవి, పోలీసు సిబ్బంది ఇండ్లలోనేవారిని ఇండ్లు ఖాళీ చేయించి పునరవాస కేంద్రానికి తరలించారు.

చింతకాని: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జనజీవనం అతలాకుతలం అయింది. చెరువులన్నీ అలుగులు పోసి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎస్ఐ నాగుల్‌మీరా పర్యటించారు.

వైరా: వైరా మండలంలో ఆదివారం అర్ధరాత్రి కురిసిన వానతో రాళ్ల వాగు సహా ఏర్లు, వాగులు వరదనీటితో పొంగి ప్రవహించాయి. రాళ్ల వాగుకు వచ్చిన వరదనీటితో వల్లాపురం-పాలడుగు, అష్టగుర్తి-తూటికుంట్ల గ్రామాల మధ్య రాకపోకలు నిల్చిపోయాయి. వైరా నదికి భారీ వరదనీరు రావడంతో స్నానాల లక్ష్మీపురం-సిరిపురం, గరికపాడు-ఖానాపురం గ్రామాల మధ్య రాకపోకలు నిల్చిపోయాయి.

ఏన్కూరు: ఇటీవల కురుస్తున్న భారీవర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు, నిలిచిపోయాయి. జన్నారం, అంజనాపురం గ్రామాల మధ్య నిమ్మవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది.

పెనుబల్లి: పెనుబల్లి మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు పొంగడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పెనుబల్లి మండలంలో 6.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అలుగు పారుతున్న బేతుపల్లి పెద్ద చెరువు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి పెద్ద చెరువు అలుగు పారుతోంది. దీంతో నిండు కుండలా మారిన చెరువు నుంచి మూడు అడుగుల మేర అలుగు పారుతుంది. కాగా చెరువు పూర్తినీటి సామర్థ్యం 16అడుగులు కాగా 18అడుగులకు చేరగా ఇన్‌ఫ్లో 3500క్యూసెక్కులుగా ఉందని, సర్‌ప్లస్ వాటర్ 3500క్యూసెక్కులని, మొత్తం 4,800ఎకరాలకు సాగునీటిని అందించనుండగా ఎన్టీఆర్ వరద నీటి కాలువతో సుమారు 56చెరువులు నిండుతున్నట్లు ఐబీ అధికారులు తెలిపారు.



కారేపల్లిలో కోటిలింగాల వద్ద శివాలయాన్ని ముంచెత్తిన వరదనీరు



కొణిజర్ల మండలంలో మునిగిన పంట పొలాలు



ఏన్కూరులో నీట మునిగిన పత్తి చేను



ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు వాగు



వీఎం బంజర్ రింగ్ సెంటర్లో జాతీయ రహదారిపై చేరిన నీరు



వైరా మండలంలో పొంగి ప్రవహిస్తున్న రాళ్ల వాగు

రైతులను ఆదుకోవాలి



కల్లూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

కొణిజర్ల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ప్రారంభమైన నాటి నుంచి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నిఇన్నికావని రైతు కళ్లల్లో కన్నీరు తప్ప మిగిలిందేమిలేదని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. భారీవర్షాలు, వరదలతో నీటమునిగిన మండలంలోని తనికెళ్ల గ్రామంలోని పంట పొలలాలను పరిశీలించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు యర్రాబాబు, సింగు నరసింహారావు, తాటి వెంకటేశ్వర్లు, మిడికంటి వెంకటరెడ్డి, జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు దొండపాటి రమేష్, సీపీఐ మండల కార్యదర్శి గడల భాస్కరరావు, మణిగ కోటేశ్వరరావు, యాసా వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

కల్లూరు: పంట భూములను కాపాడాలని చిన్నకోరుకొండి బాధిత రైతులు సోమవారం ప్రజావాణిలో సబ్‌కలెక్టర్, తహసీల్దార్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు వడ్లమూడి రామకృష్ణ, కుమ్మరి రామారావు, చినాల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు,రెడ్డి కృష్ణారావు, అనిల్ కుమార్, రాజారావు తదితరులు ఉన్నారు.

చింతకాని: పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం, సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నేరడ, నాగిలిగొండ గ్రామాల్లో పత్తి, పెసర, వరి పొలాలను నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, దూసరి గోపాలరావు, రాచబంటి రాము, గోగుల ఆది, గడ్డం కోటేశ్వరరావు, కొప్పుల వీరయ్య, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

బోనకల్: వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి సర్వేను వెంటనే నిర్వహించాలని సీపీఐ రైతు సంఘ జిల్లా సమితి సభ్యుడు పారుపల్లి నర్సింహారావు డిమాండ్ చేశారు. సోమవారం పంటలను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, గుడిదె కృష్ణ, ఏలూరి రమేష్, గుడిద నాగేశ్వరరావు, వంగాల నర్సింహారావు, వంగాల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



బోనకల్‌లో పంట పొలాలను పరిశీలిస్తున్న రైతులు

ఉపాధ్యాయుల నిరసన

మధిర రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం శోచనీయమని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు షేక్.నాగూర్‌వలి, ఏ.వినోదరావు ఆరోపించారు. సోమవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బి.నాగరాజు, ఈ.వీరయ్య, షేక్. ఇబ్రహీం, కాజా సునీత, రాణి, బి.కవిత, బి.చెన్నయ్య, మల్ల రాజు, షేక్.లాల్‌అహ్మద్, వూట్ల కొండలరావు, కె.ఆదాం, రమేష్, లంకా నాగేశ్వరరావు, రమేష్, నిమ్మగడ్డ గోపిచంద్, పెంటి రాంబాబు పాల్గొన్నారు.

వెంకటాపురంలో తాగునీటి ఎద్దడి

తల్లాడ, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): ఒక వైపు భారీవర్షాలతో జనజీవనం అతలాకుతలం అవుతుంది. మరోవైపు తాగునీటి ఎద్దడితో ప్రజలు అవస్థల పడుతున్న పరిస్థితి మండలంలోని వెంకటాపురం గ్రామంలో నెలకొంది. మిషన్‌భగీరథ పథకం ద్వారా పైపులైన్ లీకేజీ వల్ల 10రోజుల నుంచి వెంకటాపురం గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గ్రామంలో ఉన్న చేతిపంపులు కూడా పనిచేయకపోవడంతో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో తాత్కాలికంగా రెండు రోజులనుంచి పినపాక గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను తెచ్చి అదే గ్రామానికి చెందిన రైతు పోలేపల్లి కోటేశ్వరరావు ట్రాక్టర్‌తో అరకొరగా నీటి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా మిషన్‌భగీరథ ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వాటర్‌ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

» 15మంది ప్రయాణికులకు గాయాలు



క్షతగాత్రులను తరలిస్తున్న దృశ్యం

వైరా, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రధాన రహదారిలో వైరా నది హైలెవల్ వంతెనపై ఎదురుగా వస్తున్న ఒక లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ సహా 15మంది ప్రయాణీకులకు గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ మితిమీరిన వేగం, నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణీకులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం మణుగూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మం వెళ్తూ జగ్గయ్యపేట నుంచి తల్లాడ వైపు వెళ్తున్న లోడ్‌తో ఉన్న లారీని వంతెనపై వేగంగా ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ విజయ్ సహా 15మంది ప్రయాణీకులు గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని ముందే పసిగట్టిన లారీ డ్రైవర్ అప్రమత్తమై తన వాహనాన్ని వంతెనపైనే నిలిపి స్టీరింగ్ నుంచి పక్కకు తప్పుకోవడంతో సురక్షితంగా బయటపడ్డాడు. గాయపడిన వారిని 108వాహనాల్లో వైరా, ఖమ్మం ఆసుపత్రులకు చికిత్స కోసం తరలించారు. ఈ సమయంలో వంతెనకు ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ పి.రామారావు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలను చేపట్టారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు తీవ్ర గాయాలు

బోనకల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో సోమవారం గ్యాస్ సిలిండర్ పేలడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన తన్నీరు వెంకట్రావమ్మ ఆదివారం రాత్రి వంట చేసి గ్యాస్ ఆఫ్ చేయడం మరిచి పోయింది. సోమవారం ఉదయం వంట చేసేందుకు గ్యాస్ పోయి వెలిగించే క్రమంలో గ్యాస్ పేలి తీవ్రంగా గాయపడింది. 108 సిబ్బంది కోట బాను సహాన్, మిథున్ చక్రవర్తిలు ప్రథమ చికిత్స చేసి ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసింది.

పీఆర్టీయూ నాయకుల ముందస్తు అరెస్ట్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు కోసం హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు వెళ్తున్న పీఆర్టీయూ నాయకులను పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో ఆశాఖ మండల అధ్యక్షుడు బీ.సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.మధుసూదనాచారి, రాష్ట్ర బాధ్యులు ఏ.రవీందర్‌రెడ్డి, ఎండీ.రియాజుద్దీన్, డీ.ఏసురత్నం ఉన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా గన్నేని



సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సత్తుపల్లి మండల అధ్యక్షుడిగా కాకర్లపల్లి గ్రామానికి చెందిన గన్నేని రాంప్రసాద్‌ను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీచేసింది. తన ఎన్నికకు సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, జిల్లా నాయకులు కేతినేని హరీష్, పోట్రు రామారావులకు కృతజ్ఞతలు తెలిపారు.

వినాయక మండపాల వద్ద అన్నదానం

కారేపల్లి, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుంపెళ్లగూడెం గ్రామంలో గణేష్ మండపం వద్ద ఏర్పాటు చేసిన అన్నదానకార్యక్రమాన్ని రాష్ట్రమహిళ కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, మండల నాయకులు ధారవత్ వినోద్‌లు ప్రారంభించారు. కార్యక్రమం లో మైనార్టీ నాయకులు ఎండీ హనీఫ్, వీరన్న, సైదులు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా గణేష్ మండపాల వద్ద భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. లింగాలలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో ఎస్ఐ హరిత పాల్గొని ప్రారంభించారు. నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు.

తల్లాడ: మండలంలోని బాలపేట గ్రామంలో గణేష్ కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలల్లో భాగంగా వినాయక విగ్రహం ప్రతిష్ఠించారు. ఆదివారం రాత్రి లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈపాటలో పాల్గొన్న ఆగ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు షేక్. జానీపాషా లడ్డూను రూ.30,516కు దక్కించుకున్నాడు.

ముదిగొండ: మండలంలోని పలు గ్రామాల్లో వినాయక మండపాల వద్ద సోమవారం మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ముదిగొండలోని లిటిల్ ఇండియన్స్ పాఠశాలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ పొదిలి శివకృష్ణ ప్రారంభించారు.

సత్తుపల్లిరూరల్: 16వ వాసవీ గణపతికి 108రకాల ప్రసాదాలతో భక్తులు సోమవారం నైవేద్యం సమర్పించారు. స్థానిక శ్రీ కోదండ రామాలయం వద్ద వర్తక సంఘం ఆవరణలో సత్తుపల్లి మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్ సంయుక్త ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుడికి భక్తులు 108రకాల ప్రసాదాలతో నివేదన అందించినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ వందనపు సత్యనారాయణ, కో చైర్మన్ సోమిశెట్టి శ్రీధర్ తెలిపారు.



సత్తుపల్లిలో గణపతికి సమర్పించిన 108 రకాల నైవేద్యాలు



లింగాలలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ హరిత



కారేపల్లిలో...



ముదిగొండలో...